



'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా నేడే

మూడు ప్రధాన బహుమతులతో పాటు 125 కన్సొలేషన్ కానుకలు

తిరుపతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అభిమాన పాఠకులు ఎదురుచూస్తున్న 'ఆంధ్రజ్యోతి లక్కీ డ్రా' మంగళవారం జరగనుంది. రేణిగుంట మండలం దామినేడు సమీపంలోని ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయంలో 'కార్ అండ్ బైక్ రేస్' అదృష్ట పాఠకులు ఎవరన్నది తేలనుంది. సాయంత్రం 4.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రముఖులు అతిథులుగా పాల్గొని పాఠకుల నుంచి వచ్చిన వేలాది కూపన్లలో విజేతలను ఎంపిక చేయనున్నారు. ప్రథమ బహుమతి కింద మోటార్ బైక్, రెండో బహుమతి రిఫ్రిజిరేటర్, మూడో బహుమతి టీవీని విజేతలకు అందజేయనున్నారు. మరో 125 కన్సొలేషన్ బహుమతుల కింద ఒక్కొక్కరికి రూ.2వేలు విలువచేసే గృహోపకరణాలను అందిస్తారు. 2024 నవంబరు 1 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ మధ్య ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 12 కూపన్లను (4 సెట్లు) పాఠకులు ఇప్పటికే ఆంధ్రజ్యోతి కార్యాలయానికి పంపారు. జిల్లాలో వేల సంఖ్యలో ఈ కూపన్లు పంపగా, వీరిలో అదృష్టవంతులు ఎవరన్నది మంగళవారం తేలనుంది. డ్రాకు హాజరుకాలేని విజేతలకు ఫోన్ ద్వారా సమాచారం అందించడం జరుగుతుంది. ఈ కూపన్లు మళ్లీ విజయవాడలో జరిగే లక్కీడ్రాకు వెళతాయి. అక్కడి డ్రాలో గెలిచిన రాష్ట్ర విజేతకు మారుతి కారు బహుమతిగా దక్కుతుంది.



సమయం : మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు

వేదిక : దామినేడు సమీపంలోని ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయం

● 2024-25 ఏడాదికి టీటీడీ రూ.5,141.74 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది. సవరించిన అంచనాల మేరకు రూ.5,179.85గా పేర్కొంది. తాజాగా 2025-26 బడ్జెట్ అంచనాలో రూ.5,258.68 కోట్లు.
ఈ ఏడాది బడ్జెట్ అంచనా స్వల్పంగా రూ.78.83 కోట్లు పెరిగింది.

హుండీ.. వడ్డీ

టీటీడీకి ప్రధాన ఆదాయ వనరులివే

స్వల్పంగా పెరిగిన ఆదాయ అంచనా



తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): టీటీడీ తాజాగా ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్‌లోనూ శ్రీవారి హుండీ, వడ్డీ ద్వారానే ఆదాయం భారీగా సమకూరుతుందని అంచనా వేసింది. గడిచిన ఏడాది హుండీ ద్వారా రూ.1,611 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేయగా, రూ.1,671 కోట్ల కానుకలు లభించాయి. ఈక్రమంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1,729 కోట్ల హుండీ ఆదాయం లభిస్తుందని టీటీడీ అంచనా వేసింది. రూ.900 కోట్ల నుంచి రూ.వెయ్యి కోట్లలోపు ఉండే హుండీ ఆదాయ అంచనాలు కొవిడ్ అనంతరం భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈక్రమంలో 2022-23 బడ్జెట్‌లో హుండీ ద్వారా రూ.వెయ్యి కోట్లు లభిస్తుందని అంచనా వేయగా ఎవరూ ఊహించని విధంగా రూ.1,613 కోట్లు లభించింది. అలాగే 2023-24కి గాను రూ.1,611, 2024-25కి గాను రూ.1,671 కోట్ల అదాయం లభించింది.

● మరోవైపు వడ్డీల ద్వారా గతేడాది రూ.1,167 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేయగా, రూ.1,253 కోట్లు లభించింది. ఈక్రమంలో నూతన బడ్జెట్‌లో రూ.1,310 కోట్లు వడ్డీల ద్వారా లభిస్తుందని టీటీడీ అంచనా వేస్తోంది. కొవిడ్ ముందు వరకు వడ్డీల ద్వారా కేవలం రూ.800 కోట్లలోపే సమకూరేది.

● దర్శనంపై గతేడాది రూ.338 కోట్లు లభిస్తుందని టీటీడీ అంచనా వేసినప్పటికీ రూ.305 కోట్లు మాత్రమే సమకూరింది. దీంతో 2025-26 వార్షిక ఏడాదికి కేవలం రూ.310 కోట్లు మాత్రమే వస్తుందని అంచనా వేశారు.

● ప్రసాదాల ద్వారా రూ.600 కోట్లు లభిస్తుందని గతేడాది భావించగా రూ.50 కోట్లు తగ్గింది. అయినప్పటికీ రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.600 కోట్లు వస్తుందని భావిస్తున్నారు.

● గతేడాది ఇంజనీరింగ్ పనులకు, ఇంజనీరింగ్ నిర్వహణకు రూ.540 కోట్లు కేటాయించినప్పటికీ రూ.500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. తాజా వ్యయాల అంచనాలోనూ రూ.500 కోట్లే కేటాయించారు.

● గతేడాది గరుడవారధి నిర్మాణానికి రూ.53 కోట్లు కేటాయించినప్పటికీ రూ.25 కోట్లే ఖర్చు చేశారు. దీంతో తాజా బడ్జెట్‌లో రూ.28 కోట్లు కేటాయించారు.

● గడిచిన ఏడాది ధార్మిక ప్రచారానికి రూ.131.50 కోట్లు ఖర్చు కాగా, నూతన బడ్జెట్‌లో రూ.10 కోట్లు తగ్గించారు.

బడ్జెట్‌లో పొందుపరిచిన అంచనాల వివరాలు

ఆదాయాల అంచనా..	(రూ.కోట్లలో)
ప్రారంభనిల్వ	488.90
హుండీ	1,729
వడ్డీ	1,310
ప్రసాదాలు	600
దర్శన టికెట్లు	310
ఆర్జితసేవలు	130
అద్దెగదులు, కల్యాణమండపాలు	157
తలనీలాల వేలం	176.50
రుణాలు, సెక్యూరిటీ-డిపాజిట్లు తదితరాల ద్వారా	76.38
ట్రస్టులు	90
అద్దెలు, విద్యుత్‌బిల్లులు, వాటర్ బిల్లులు	66
ప్రచురణల విక్రయాలు	31
ఇతర ఆదాయాలు(అగర్‌బత్తి, టోల్‌గేట్ వంటివి)	93.90
	5,258.68

వ్యయాల అంచనా..	(రూ.కోట్లలో)
మానవ వనరులు	1,773.75
వస్తువుల కొనుగోళ్లు	768.50
కార్పస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్	800
ఇంజనీరింగ్ పనులు	350
గరుడవారధి	28
స్విమ్స్ ఆస్పత్రి ఇంజనీరింగ్ క్యాపిటల్ వర్క్స్	60
స్విమ్స్ రెవెన్యూ గ్రాంట్స్	60
ఇంజనీరింగ్ నిర్వహణ పనులకు	150
ఫ్యాకల్టీ మేనేజ్‌మెంట్ సర్వీస్	80
ఇతర సంస్థలకు గ్రాంట్స్	130
హిందూధార్మిక ప్రచారానికి	121.50
రుణాలు, ముందుగా ఉద్యోగులకు చెల్లింపులు, ఈఎమ్‌డీ, సెక్యూరిటీ డిపాజిట్స్	177.62
పెన్షన్ ఫండ్ కాంట్రిబ్యూషన్స్	100
విద్యుత్ ఉత్పత్తికయ్యే వ్యయం	70
కాంట్రిబ్యూషన్స్ టు స్టేట్ గవర్నమెంట్	50
ఇతర క్యాపిటల్ పనులు	52.50
ఇతర చెల్లింపులు	50.08
ఇతర నిర్వహణ ఖర్చులు	40
ప్రకటనలు	8
క్లోజింగ్ క్యాష్, బ్యాంక్ నిల్వ	448.73
	5,258.68 కోట్లు



ఉద్యోగుల సిఫార్సులకు 'సుపథం' ద్వారా శ్రీవారి దర్శనం

● టీటీడీ కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కమిటీ

● తిరుపతిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధికి రూ.కోటి

తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): టీటీడీ శాశ్విత ఉద్యోగుల సిఫార్సు లేఖలపై మూడు నెలలకోసారి సుపథం ద్వారా ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పించాలని తీర్మానించినట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. సమావేశానికి ముందు టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. బోర్డులో తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ మీడియాకు వెల్లడించారు.

● తమకొచ్చే రూ.43 వేల జీతంలో జీఎస్టీ పేరుతో రూ.4,800 కోత విధిస్తున్నారని, మొత్తం జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని పోటు కార్మికులు కోతల్లేకుండా జీతాలు అందించాలని తీర్మానించాం.
● తిరుమలకు వచ్చే వీఐపీ, నాన్ వీఐపీలకు మంచి వసతి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో 12 బ్లాకుల్లోని 1,875 గదుల మరమ్మతులకు రూ.26 కోట్లు కేటాయించాం. మరికొన్నింటిని పూర్తిగా తొలగించి తిరిగి నిర్మించాల్సి ఉంది. మొత్తం 424 బ్లాకుల్లోని గదులను ఆధునికీకరిస్తాం.
● తిరుమలలో లైసెన్సు లేకుండా ఉన్న దుకాణాలు, తట్టలను తొలగించేలా రెవెన్యూ, విజిలెన్స్ విభాగాలతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తాం.
● టీటీడీ కళాశాల్లో 25 ఏళ్లుగా పనిచేస్తున్న 151 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్య పరిష్కారం కోసం కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.
● తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి పనులకు రూ. కోటి మంజూరు చేయాలని ఆమోదం తెలిపాం.
● జాతీయ బ్యాంకుల్లో టీటీడీ డిపాజిట్లపై మరోసారి బోర్డులో చర్చించాం. అధిక వడ్డీలు వచ్చేలా గుర్తింపు కలిగిన బ్యాంకుల్లోనే డిపాజిట్లు పెట్టే అంశంపై పరిశీలిస్తున్నాం.
● తిరుమలలో స్థలాక్రమణలకు పాల్పడుతున్న మఠాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. త్వరలో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటాం.
● టీటీడీ ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ అంశంపై పరిశీలించాలని అధికారులను బోర్డు కోరింది.
● కాశి మఠానికి నిత్యహారతులకు అనుమతివ్వాలని తీర్మానించాం.





ఫిబ్రవరి 2న పట్టుబడిన గ్రావెల్ నిల్వల వద్ద వీఆర్వో శ్రీదేవి (ఫైల్ ఫొటో).. అదే ప్రదేశంలో కనిపించని గ్రావెల్

పట్టుబడిన గ్రావెల్ ఎక్కడ?

సూళ్లూరుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అధికారులు 50 రోజుల కింద పట్టుకున్న గ్రావెల్.. నాలుగు రోజుల క్రితం మాయమైపోయింది. అక్రమార్కులు తీసుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీని వెనుక కొందరు అధికారుల అండ ఉందన్న ఆరోపణలున్నాయి. ఫిబ్రవరి 2న సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరులోని జగనన్న ఇళ్ల కాలనీలోని ప్లాట్ల నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలించి.. పెట్రోల్ బంక్ సమీపాన నిల్వ చేసి.. టిప్పర్ల ద్వారా వెంచర్లకు తరలిస్తున్నారు. గ్రామస్తులు ఫిర్యాదుతో గ్రావెల్ నిల్వలతో పాటు టిప్పర్‌నూ అధికారులు సీజ్‌చేశారు. పోలీసులకూ రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు. దాదాపు 30 టిప్పర్లకుపైగా గ్రావెల్ నిల్వలను సీజ్‌చేశారు. కానీ.. నాలుగు రోజుల కిందట ఆ గ్రావెల్‌ను అక్రమార్కులు రాత్రివేళ ఎక్స్‌కవేటర్ల సాయంతో టిప్పర్లకు లోడ్‌చేసి తీసుకెళ్లారు. గ్రావెల్ నిల్వల మాయం వెనుక కొందరి అధికారుల సహకారం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు.

స్మార్ట్ సిటీ.. పల్లె పండుగ పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

బాలాజీ రిజర్వాయర్‌కు నిధులివ్వండి ● ప్రభుత్వానికి కలెక్టర్ వినతి

తిరుపతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించిన పలు పెండింగ్ సమస్యలను కలెక్టర్ వెంకటేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. మంగళ, బుధవారాల్లో కలెక్టర్ల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఆయన సోమవారం మధ్యాహ్నమే అమరావతి చేరుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పలు శాఖల ముఖ్య కార్యదర్శులను కలిశారు. 'తిరుపతి స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద పూర్తయిన 12 పనులకు సంబంధించి రూ.60 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న మరో 14 పనులకు రూ.వంద కోట్ల వరకూ బిల్లులు చెల్లించాలి. అలాగే, పల్లెపండుగ కింద జిల్లాలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైన్లు, గోకులం షెడ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.100 కోట్ల వరకూ బిల్లులు పెండింగులో ఉన్నాయ. ఉపాధి హామీ పథకం కింద ఆ నిధులను మంజూరు చేయాలి. తిరుపతి, తిరుమల తాగునీటి అవసరాలు తీర్చడంలో కీలకంగా మారిన బాలాజీ రిజర్వాయర్ నిర్మాణానికి త్వరితగతిన నిధులు కేటాయించాలి' అని అధికారులను కలెక్టర్ అభ్యర్థించారు. పలు పర్యాటక ప్రాజెక్టుల ప్రతిపాదనలనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వీటితో పాటు మంగళ, బుధవారాల్లో జరగనున్న కాన్ఫరెన్సులో జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి ప్రతిపాదనలను, అంచనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయనున్నారు.

ఉపాధి పనులను ఉదయాన్నే ప్రారంభించాలి

● తాగునీరు, మెడికల్‌కిట్లు అందుబాటులో ఉంచాలి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి పనులను ఉదయాన్నే ప్రారంభించి 11 గంటలకల్లా ముగించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్‌గ్రీవెన్స్ హాల్‌లో అధికారులతో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో షెడ్లు, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్‌కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజలూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, మందులు తగినంత స్టాక్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (మంగళవారం సాయంత్రం)
సహర్: 4:54 (బుధవారం ఉదయం)

ఇద్దరు టెన్త్ విద్యార్థుల డీబార్

● ఇద్దరు ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేసిన డీఈవో

తిరుపతి(విద్య), మార్చి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షల్లో కేవీబీపురంలో కాపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను డీబార్ చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను ఇన్విజిలేటర్లు బి. యాదగిరి, ఎస్.దివాకర్‌ను సస్పెండ్ చేశారు. కాగా, సోమవారం నాటి పరీక్షకు 26,625 మంది విద్యార్థులు హాజరయ్యారు. 518 మంది గైర్హాజరయ్యారు.

కరిరాజుపై పద్మావతిదేవి అభయం



గజవాహనంపై ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు సోమవారం గజవాహనంపై కొలువుదీరి ఆలయమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాషాడను పురస్కరించుకుని సోమవారం వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొపి అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మూలవర్లకు అభిషేకం చేశారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తికి సుగంధపరిమళ ద్రవ్యాలతో తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం గజవాహన సేవ అత్యంత వేడుకగా జరిగింది. కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు, ఏవీఐ బ్రహ్మానందరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మొగరాల సమీపంలో రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం పరిశీలించారు. మొగరాల, రవణయ్యగారిపల్లె, వల్లివేడు రోడ్డు పనులను పరిశీలించారు. ఈ మార్గంలో 7 కిలోమీటర్ల మేర రూ.4 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. పనులు నాణ్యంగా, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పాకాల న్యూకాలనీలో టీడీపీ సీనియర్ నేత ఎం.వెంకటాద్రిబాబును, పొగతోటలో మాజీ ఎంపీపీ చాముండేశ్వరి మోహన్‌లను పరామర్శించారు.

సిద్ధార్థలో ఘనంగా వీడ్కోలు సభ



బహుమతులు అందిస్తున్న ఆనందరెడ్డి, ప్రిన్సిపాల్ రాజశేఖర్

తిరుపతి రూరల్, మార్చి24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లె లోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ ఫైనలియర్ విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సభ నిర్వహించారు. అతిథిగా హాజరైన సెక్రటరీ వై.ఆనందరెడ్డి మాట్లాడుతూ సమయపాలన, ప్రణాళిక జీవితంలో విజయతీరాలకు చేరుస్తాయన్నారు. వీటిని ఆచరించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఎన్‌పీటీఈఎల్ కోర్సుల్లో అత్యుత్తమ స్కోర్ సాధించిన, అకడమిక్స్‌లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చైర్మన్ వై.కొండారెడ్డి, వై.నితిన్, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, హెచ్‌వోడీ డి.బాలసుబ్రమణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కల్యాణ వెంకన్న పుష్పయాగ అంకురార్పణ



అంకురార్పణ చేస్తున్న అర్చకులు

చంద్రగిరి మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం జరగనున్న పుష్పయాగానికి సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. 6 గంటల నుంచి పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ చేపట్టారు. మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం చేపట్టనున్నారు. ఆలయంలో ఫిబ్రవరి 18 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. బుధవారం అష్టోత్తర శతకలశాభిషేకం, గురువారం తిరుప్పావడ, నిత్య కల్యాణోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదార్ చిరంజీవి పాల్గొన్నారు.

క్షయరహిత సమాజమే ధ్యేయం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయ రహిత సమాజమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ, రుయాస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో రుయాస్పత్రిలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన రుయా పల్మనరీ విభాగాధిపతి సుబ్బారావు, డీఎల్‌వో శ్రీనివాసులరెడ్డిలతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. క్షయ నివారణ మార్గాల గురించి అవగాహన కల్పిస్తూ రుయాస్పత్రి నుంచి ఎస్వీ వైద్య కళాశాల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ఏడాది క్షయ నివారణ కార్యక్రమంలో ప్రతిభ కనబరచిన వారికి అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, డాక్టర్లు ప్రేమానంద్, శ్రీహరిరావు, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం



టీటీడీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడాసముదాయం అభివృద్ధికి టీటీడీ రూ.కోటి మంజూరు చేయడంపై శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు టీటీడీ చైర్మన్ బి.రాజగోపాల్‌నాయుడు, ఈవో శ్యామలరావులను సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. క్రీడాభివృద్ధికి టీటీడీ సహకారం మరువలేమన్నారు.

చంద్రగిరి

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

రామచంద్రాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రామచంద్రాపురం తహసీల్దారు వెంకటరమణ అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. తహసీల్దారు మాట్లాడుతూ అర్జీదారులు ఇచ్చిన ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలన్నారు. ఈనెల 31వ తేదీలోపు రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ పూర్తి కావాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ అన్వర్ బాషా, రీసర్వే డీటీ అమృత, మండల సర్వేయర్ రమేస్‌బాబు, ఎంఈవో మార్కండేయులు నాయుడు, హౌసింగ్ ఏఈ మహేష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మామిడి తోటల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో మామిడి తోటల నిర్వహణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాస్ కృషి విజ్ఞానకేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త పీఎస్ సుధాకర్ తెలిపారు. తేనెమంచు, తామర, కాయ తొలుచు పురుగులు ఆశించడం, ఉష్ణోగ్రతలు పెరగడంతో నేలలో తేమశాతం తగ్గి పిందెలు రాలిపోతున్నట్లు గుర్తించామన్నారు. పురుగుల నివారణకు డైనోటోపురాన్ 4శాతం, అసిఫేట్ 50శాతం, ఎస్‌జీ 1.25గ్రాములు లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 1.5శాతం, ఫిప్రోనిల్ 3.5శాతం, ఎస్.పి. 1.5మి.లీ., వేపనూనె 3.మి.మీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే నేల, వాతావరణ పరిస్థితులను బట్టి తగినన్ని నీటి తడులను ఇవ్వాలన్నారు. పిందెలు బఠాని, నిమ్మకాయ సైజు దశలో పోషక, హార్మోన్ల లోపాలు రాకుండా 19-19-19 లేదా 13-0-45 10 గ్రాములు ప్లానోఫిక్స్ 0.2మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

రేపు వారపుసంత వేలం

పాకాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పాకాల మేజర్ గ్రామ పంచాయతీ వారపుసంత వేలాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి లావణ్యలత తెలిపారు. దినసరి మార్కెట్, వారపుసంత, ప్రైవేటు బస్టాండు, జంతు వధశాల, పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ గదులకు, చింతచెట్లు, కొబ్బరిచెట్ల ఫలసాయం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు కాల పరిమితి ఉంటుందని, ఆసక్తి గల వారు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు.

అవిలాలలో యూడీఎస్ పనుల ప్రారంభం

తిరుపతిరూరల్, మార్చి24(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం అవిలాల పంచాయతీలో రూ.8.6 లక్షలతో యూడీఎస్ పనులను ప్రారంభించారు. వినాయకనగర్ ఆర్చ్ నుంచి గంగమ్మ గుడి వరకు ఈ పనులను పంచాయతీ నిధులతో చేపడుతున్నారు. ఇటీవల పంచాయతీ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు యూడీఎస్ సమస్యపై విన్నవించారు. స్పందించిన ఆయన త్వరలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కాగా పోస్టాఫీ సువీధిలో జరుగుతున్న పనులను సోమవారం గ్రామ సర్పంచ్ చెందిలి వెంకటరమణ, కూటమి పార్టీ నేతలు పర్యవేక్షించారు.

ట్రాఫిక్ విధులపై విద్యార్థులకు అవగాహన



ట్రాఫిక్ సిబ్బంది విధులను వివరిస్తున్న సీఐ

తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ విధులపై ఎస్వీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం సాయంత్రం తిరుమల ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. 20 మంది విద్యార్థులను ఎస్ఎంసీ సర్కిల్ వద్దకు తీసుకువచ్చి ట్రాఫిక్ సిబ్బంది డ్యూటీ ఎలా ఉంటుంది.. ప్రధాన విధులు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారు వంటి విషయాలను సీఐ హరిప్రసాద్ వివరించారు.

గొల్లపల్లె సచివాలయంలో చోరీ



తలుపునకు ఉన్న లింక్‌గడిని పగలకొట్టిన దృశ్యం

తిరుపతిరూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం సి.గొల్లపల్లె గ్రామ పంచాయతీలోని సచివాలయంలో దొంగలు పడ్డారు. రూ.18వేల విలువ చేసే ప్రింటర్, ఇండక్షన్ స్టౌ, ప్లాస్క్, ఇంక్‌బాటిల్‌తోపాటు కొంతవరకు స్టేషనరీని ఎత్తుకెళ్లారు. ఈ ఘటన ఒకరోజు ఆలస్యంగా వెలుగుచూసింది. పంచాయతీ కార్యదర్శి జి.వెంకటశివ చెప్పిన వివరాల మేరకు.. సచివాలయ సిబ్బంది శనివారం సాయంత్రం విధులు ముగించుకుని వెళ్లారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఉదయం 9.45 గంటలకు శుభ్రం చేసేందుకు వచ్చిన స్వీపర్ ఈశ్వరమ్మ తలుపుగడియ పగులకొట్టి ఉండడాన్ని గమనించి పంచాయతీ కార్యదర్శికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన వచ్చి చూడగా డెస్కులలోని సామగ్రి, ఫైల్స్ చిందరవందరగా పడేసి ఉన్నాయి. ప్రింటర్‌తోపాటు కార్యాలయానికి సంబంధించిన కొన్ని డెస్కుల తాళాలు, ఇండక్షన్ స్టౌ, మరికొంత సామగ్రి కనిపించకపోవడంతో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పీజీఆర్ఎస్‌కు 59 వినతులు



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, మార్చి24(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 59 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణ రెడ్డి పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్లు వెంటనే మంజూరు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పద్మావతి నగర్‌లో నీటి వసతి కల్పించాలని, తమ స్థలంలో నిర్మించుకున్న ప్రహరీని ఎటువంటి నోటీసులూ లేకుండా తొలగించారని, వినాయక స్వామి గుడి నిర్మాణం చేస్తుంటే ఆటంకం కల్పిస్తున్నారని, కొత్తపల్లి నలంద స్కూల్ ప్రాంగణాన్ని నలందనగర్‌గా పేరు మార్చాలని తదితర సమస్యలపై వినతులు వచ్చాయి. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ మహాపాత్ర పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు - అల్లరిమూకలను నిలువరిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) టెండరు పత్రాలు చించేశారంటూ...

తిరుచానూరు వేలం పాటలో ఉద్రిక్తత

- రూ.3.51కోట్లు పలికిన ప్రైవేటు టూరిస్టు బస్టాండు
- గత ఏడాదికన్నా పెరిగిన ఆదాయం

తిరుచానూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు గ్రామ పంచాయతీలో ప్రైవేటు టూరిస్టు బస్టాండు నిర్వహణకు సోమవారం ఉద్రిక్త వాతావరణంలో జరిగిన వేలం పాటలో రూ.3.51కోట్లకు దక్కించుకున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను బహిరంగ వేలం పాట సోమవారం మొదలైంది. కైవసం చేసుకోవాలని రెండు వర్గాలు తీవ్రస్థాయిలో పోటీ పడ్డాయి. ఇక ఉదయం సీల్డ్ టెండర్ ప్రక్రియలో టెండర్ వేయడానికి వచ్చిన ఇద్దరి వద్ద డీడీతో పాటు టెండరు ఫారాలను పోలీసు ఎదుటే కొందరు లాక్కెళ్లిపోయారు. దీంతో దాదాపు రెండు గంటల పాటు పంచాయతీ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇదే సమయంలో కొంతమంది అల్లరి మూకలు రోడ్లపై పెద్దసంఖ్యలో హల్‌చల్ చేశారు. మరో వర్గం ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ వెంటనే పెద్దసంఖ్యలో పోలీసు బలగాలు తిరుచానూరుకు చేరుకున్నాయి. దుకాణాలు మూయించి, రోడ్లపై రాకపోకలను నిలిపివేసి అల్లరి మూకలు లేకుండా చేశారు. టెండరు ప్రక్రియలో పాల్గొనే వారిని మాత్రమే పంచాయతీ కార్యాలయంలోకి అనుమతించారు. 3 గంటలకు బహిరంగ వేలంపాట ప్రారంభమైంది. డీఎల్‌పీవో సురేష్‌నాయుడు, ఈవోపీఆర్డీ మాధురి వేలం పాట నిర్వహించారు. సర్కారువారి పాట రూ.3కోట్లుగా నిర్ణయించారు. వేలంపాటలో ముగ్గురు పాల్గొన్నారు. అందులో అత్యధికంగా వెంకటేష్ రూ.3.51కోట్లకు ప్రైవేటు టూరిస్టు బస్టాండును దక్కించుకున్నారు. గత ఏడాది రూ.2.89కోట్లకు టెండరు దక్కించుకోగా, ఈ ఏడాది అత్యధికంగా రూ.3.51 కోట్లు పలికింది. గత ఏడాదికన్నా రూ.61.94 లక్షలు తిరుచానూరు గ్రామ పంచాయతీకి అధికంగా ఆదాయం చేకూరింది. కాగా షాపింగ్ కాంప్లెక్సుకు కూడా టెండర్ ప్రక్రియ నిర్వహించారు.

బాడీబిల్డింగ్, మోడలింగ్ పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న బాడీబిల్డింగ్, మోడలింగ్ పోటీల విజేతలు

తిరుపతి(క్రీడలు), మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక యూత్ హాస్టల్లో సోమవారం సాయంత్రం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జిల్లా స్థాయి బాడీబిల్డింగ్, మోడలింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలకు 170(బాడీబిల్డింగ్‌కు 100, మోడలింగ్‌కు 70)మంది ప్రాతినిథ్యం వహించారు. బాడీబిల్డింగ్‌లో ఎస్.మణి, ప్రసన్నకుమార్ రెడ్డి, ఆదినారాయణ, నవీన్, రోహిత్, విగ్నేష్, మోడలింగ్‌లో ఆదిత్య, నికిత, గాయత్రి, భావన, సిమ్రాన్‌లు విజేతలుగా నిలిచారు. ముఖ్య అతిథిగా హాజరైన గోల్డెన్ ఇండియా బాడీబిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వై.ప్రవీణ్ విజేతలను అభినందించి ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో క్షయ నివారణ



చంద్రగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చంద్రగిరి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకోవడంతో క్షయవ్యాధిని నియంత్రించవచ్చునని చంద్రగిరి గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ అన్నారు. సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినాన్ని పురస్కరించుకుని చంద్రగిరి యూనిట్ క్షయవ్యాధి పరిశీలకులు వెంకటరమణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. యుగంధర్ మాట్లాడుతూ పౌష్టికాహారంతో పాటు ముందస్తు వైద్య పరీక్షల ద్వారా క్షయ వ్యాధిని అంతం చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్, డాక్టర్ సౌమ్యప్రియ, ఎడ్యుకేటర్ టాటాబాయి, సూపర్‌వైజర్లు ప్రమీల, నారాయణ, తులసీరామ్, ఏఎన్ఎంలు సుబ్బలక్ష్మి, శశిరేఖ, గిరిజ, దేవిక, వెంకటరమణ పాల్గొన్నారు.

సానుకూల దృక్పథంతో ఉన్నత భవిష్యత్తు



మాట్లాడుతున్న సైకాలజిస్టు శ్రీనివాస్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సానుకూల దృక్పథం ఏర్పరుచుకోవడం ద్వారా విద్యార్థులు ఉన్నత భవిష్యత్తును పొందవచ్చని హైదరాబాదు ప్రముఖ సైకాలజిస్టు శ్రీనివాస్ పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసంపై ఎస్వీయూనివర్సిటీ, పద్మావతి డిగ్రీ కాలేజీల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కష్టనష్టాలను అధిగమించి రాణించిన వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవడం ద్వారా ఆత్మ విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక అంశాలపైనా శ్రద్ధ వహించడం ద్వారా శారీరక, మానసిక ఉత్తేజాన్ని పొందవచ్చన్నారు. వీసీ అప్పారావు మాట్లాడుతూ విషయ జ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా పెంచుకోవాలన్నారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ స్వామి వివేకానంద, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయుల జీవిత గాథలను చదవడం ద్వారా జీవితానికి ప్రేరణ లభిస్తుందని అభిప్రాయపడ్డారు. వర్సిటీ కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, పద్మావతి కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణమ్మ, డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీ విద్యార్థుల పాండిచ్చేరి సందర్శన



పాండిచ్చేరిలో విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సంస్కృత యూనివర్సిటీ యోగా విభాగ విద్యార్థులు పాండిచ్చేరిని సందర్శించారు. పాండిచ్చేరిలోని అరవిందో యోగాసన కేంద్రం, ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ సెంటర్‌లను వారు రెండు రోజులుగా పరిశీలించారు. యోగాసనాలు, వెల్నెస్ విధానంపై క్షేత్రస్థాయిలో పరిశీలించడమే ఈ సందర్శన లక్ష్యం. కార్యక్రమంలో యోగా హెడ్ తపన్‌కుఆర్‌ఘడై, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, శివకుమార్, లోకేష్, నాగలక్ష్మి, అజయ్, రాహుల్ పాల్గొన్నారు.

విశ్రాంత డీవైఈఈ మృతి



బి.కరుణాకర్ (ఫైల్ ఫొటో)

తిరుపతి(ఆటోనగర్), మార్చి24 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం తిరుపతి, అనంతపురం సర్కిల్స్‌లో డీవైఈఈగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన బి.కరుణాకర్(61) సోమవారం మధ్యాహ్నం తిరుపతి కేటీ లేఅవుట్‌లోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతిపట్ల ఇంజనీరింగ్ అసోసియేషన్ నాయకులు అయూబ్‌ఖాన్, మునిప్రసాద్, జయప్రకాష్‌లతోపాటు ఎస్ఎస్‌సి బ్యాచ్ మిత్రులు మస్తాన్‌బాబు, గిరిధర్‌రెడ్డి, నజీర్‌సాహెబ్, రెడెప్ప, యాసిన్‌లు సంతాపం తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుచానూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తనపల్లి వద్ద ఉన్న రఘునాథ్ రిసార్ట్స్‌లో ఎమ్మెల్యే పులివర్తి నాని సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం బాధిత కుటుంబాలకు అందజేశారు. తిరుపతి రూరల్, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, యర్రావారిపాళెం మండలాలకు చెందిన పలువురికి సీఎం సహాయనిధి ద్వారా రూ.17,37,521 మంజూరైంది. దాన్ని బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెంగయ్య



మాట్లాడుతున్న కల్లూరు చెంగయ్య

శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరు చెంగయ్య పేర్కొన్నారు. శ్రీకాళహస్తిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుల జనాభా నిర్ధారణ కాకముందే ఎస్సీ వర్గీకరణ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అత్యధిక సంఖ్యలో ఉన్న మాలలకు అన్యాయం జరిగేలా వర్గీకరణ చేయడం బాధాకరమన్నారు. పార్లమెంటులో మాత్రమే రిజర్వేషన్ వర్గీకరణ చేసే అధికారం ఉంటుందన్నారు. అయితే తెలుగు రాష్ట్రాల్లో ఎందుకు ఉత్సాహం ప్రదర్శిస్తున్నారని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా కులచిచ్చు రేపడానికి కుతంత్రాలు జరుగుతున్నాయని చెప్పారు. త్వరలో సీఎం చంద్రబాబును కలిసి తమ గోడును విన్నవించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చింతా రాజేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోగిల ధర్మయ్య, రాష్ట్ర మాల మహాసేన నాయకులు తలారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపిన పోటు కార్మికులు, లెక్చరర్లు



తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం జరిగిన బోర్డు సమావేశంలో తమకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్న క్రమంలో పోటు కార్మికులు, లెక్చరర్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం రాత్రి చైర్మన్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సత్కారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ప్రతిభ కనభరిచిన ఎన్‌సీసీ క్యాడెట్లను ఎన్‌సీసీ అధికారులు సత్కరించారు. డ్రెస్సేజ్ ఈవెంట్‌లో బంగారుపతకం, టెన్త్ పెగింగ్‌లో రజిత పతకం, బెస్ట్ రైడర్ ఈవెంట్‌లో రజిత పతకం, కాంస్య పతకాలను క్యాడెట్లు పొందారు. ఛాలెంజింగ్ సిక్స్‌బార్ జంపింగ్‌లో వెటర్నరీ కాలేజీ విద్యార్థిని అంజలి ట్రోఫీ సాధించారు. ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ కమాండర్ సత్యాందర్‌దయ, కల్నల్ సంజీవ్ యాదవ్ పాల్గొన్నారు.

అడవికాదు..ప్రాథమిక పాఠశాల

- ముళ్లపొదల్లో స్కూలు ఆవరణ



పాఠశాల చుట్టూ ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు - దుస్థితిలో మరుగుదొడ్లు

తిరుపతి అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : తిరుమలనగర్ గ్రామ సచివాలయానికి పక్కనే 20 ఏళ్ల క్రితం పాఠశాల ఏర్పాటు చేశారు. రెండెకరాల విస్తీర్ణంలో ఓ మూలన రెండు చిన్నగదులతో తరగతి గదులు నిర్మించారు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న ఈ పాఠశాలనురెండేళ్ల క్రితం నాడు-నేడు పథకం కింద రంగులు, ఫ్యాన్స్ విద్యుత్, తాగునీటి కొళాయిలు, మరుగుదొడ్లు వంటివి ఏర్పాట్లు చేశారు. పాఠశాల గదులకు రాకపోకల దారులు మినహా మూడు భాగాల ప్రాంగణమంతా కంపచెట్లు, పిచ్చిమొక్కలు, చీమలపుట్టలు, ఎండిన చెట్ల ఆకులు, కొమ్మలతో అడవిని తలపిస్తోంది. చెత్తకుండీలు లేకపోవడంతో వ్యర్థాలను గదుల పక్కనే పడేస్తున్నారు. ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండడంతో భద్రత కరువైంది. టీచర్లు, పిల్లలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చదువుకుంటూనే ఉద్యోగాలు చేజిక్కించుకోవాలి

● టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా ● ఘనంగా ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం, జాబ్ అచీవర్స్ డే



మాట్లాడుతున్న ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా - విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

తిరుపతి(విద్య), మార్చి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుకుంటున్నప్పుడే మంచి ఉద్యోగావకాశాలను చేజిక్కించుకోవాలని టెక్నికల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్ ప్రియా సూచించారు. తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం, జాబ్ అచీవర్స్ డేను సోమవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. పిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నిర్మల్‌కుమార్ ప్రియా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. చదువుకునే సమయంలో ఉద్యోగావకాశాలు వెతుక్కోవడం ద్వారా డిప్లమా పూర్తికాగానే మంచి కంపెనీలో పనిచేసే అవకాశం పొందుతారని, సమయం వృథా కాకుండా ఉంటుందని తెలిపారు. ప్రిన్సిపాల్ ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న ప్రతి విద్యార్థికీ ఉద్యోగావకాశాలు కల్పించామని చెప్పారు. థాట్‌వర్క్స్, టెక్సాస్ ఇన్‌స్టుమెంట్ కంపెనీలతోపాటు ఎన్నో ప్రఖ్యాత కంపెనీల్లో తొమ్మిది లక్షల ప్యాకేజీ వరకు తమ కళాశాల ఫైనలియర్ విద్యార్థులు పొందారని వివరించారు. అనంతరం అకడమిక్ మెరిట్ సర్టిఫికెట్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, పాలిటెక్ ఫెస్ట్‌లో ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల జనరల్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్.సి. గౌరీశంకర్, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి



నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్న కందారపు మురళి

తిరుపతి (ఆటోనగర్), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లా విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు 2022 పీఆర్‌సీ అరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. షిఫ్ట్ ఆపరేటర్లుగా పదోన్నతి పొందిన 170 మంది కార్మికులకు జీతాలు తగ్గించడం అన్యాయమన్నారు. కార్మికులకు ఇంత అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్ రెడ్డి, నాయకులు నాయబ్ రసూల్, కిరణ్‌కుమార్, శివశంకర్, శివప్రసాద్‌రెడ్డి, సుబ్రమణ్యంరాజు, శ్రీనివాసులు రెడ్డి, ఎస్.జయచంద్ర, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఆర్.మురళీధర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

తిరుపతి(ఆటోనగర్) మార్చి24(ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ విద్యుత్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని టౌన్ ఈఈ వి.చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. పాత తిరుచానూరు రోడ్డులోని తిరుపతి టౌన్ ఈఈ కార్యాలయంలో సోమవారం డివిజన్ పరిధిలో ఉన్న అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ వినియోగం పెరుగుతోందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఆ మేరకు డీటీఆర్‌ల సామర్థ్యాన్ని అవసరం మేరకు పెంచాలని సూచించారు. సెక్షన్లు, ఫీడర్ల పరిధిలో విద్యుత్ వినియోగంపై క్షేత్రస్థాయి సిబ్బంది నిఘా ఉంచాలన్నారు.డీఈఈలు అంజనేయులు, మునిప్రసాద్, జయప్రకాష్, రమేష్, ఏఈలు ఎ.మోహన్, శ్రీనివాసులనాయుడు, బాలకొండయ్య పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీహరిరావుకు సన్మానం



శ్రీహరిరావును అభినందిస్తున్న బీజేపీ నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత డాక్టర్ శ్రీహరిరావు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులయ్యారు. వైద్య రంగంలో ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబరుగా నియమించింది. బీజేపీ నాయకులు పలువురు శ్రీహరిరావును ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ

తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సోమవారం ఆవిష్కరించారు. తిరుమల అన్నమయ్య భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 6 నుంచి 14వ తేదీ వరకు ఈ బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయన్నారు. దీనికోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 12 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందికి తిరుపతి నాలుగవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. వీరిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 12 మందికి రూ.1.20 లక్షల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు.



అభినయమే కాదు.. అలంకరణా ముఖ్యమే

● డ్యాన్స్ కాస్ట్యూం వర్క్‌షాప్‌లో వక్తలు



కళా ప్రదర్శనలో విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నృత్యం ద్వారా అందరినీ ఆకట్టుకోవడానికి అభినయం ఒక్కటే సరిపోదని, సరైన అలంకరణ, దుస్తులు కూడా ముఖ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సంగీత, నృత్య విభాగంలో డ్యాన్స్ కాస్ట్యూం అండ్ మేకప్ అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. మద్రాసుకు చెందిన భరత నాట్య కళాకారులు (ట్రాన్స్ ఉమెన్) దేవనర్తకి మాట్లాడుతూ నృత్యకారులకు ఎటువంటి అలంకరణ, దుస్తులు వినియోగించాలనేది అతి ముఖ్యమని అభిప్రాయపడ్డారు. తిరుపతికి చెందిన భరతనాట్య నృత్యకారులు, మేకప్ కళాకారులు ఎన్.శివప్రసాద్ మాట్లాడుతూ మంచి కాస్ట్యూం, మేకప్ వంటివి నృత్య ప్రదర్శనకు అదనపు అందాన్ని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో డీన్ విజయలక్ష్మి, హెడ్ శైలేశ్వరి, వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్ హిమబిందు, ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్ సహకార శాఖాధికారిగా సురేష్‌బాబు

తిరుపతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి డివిజన్ సహకార శాఖాధికారిగా జె.సురేష్‌బాబు నియమితులయ్యారు. ప్రస్తుతం కడప జిల్లా ప్రొద్దుటూరు డివిజన్ సహకార శాఖాధికారిగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం తిరుపతిలో ఖాళీగా వున్న డీఎల్‌సీవో పోస్టుకు బదిలీ చేసింది. బదిలీలపై నిషేధం ఉన్నప్పటికీ ఆయన సతీమణి తిరుపతిలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తుండడంతో పాటు వైద్య కారణాలు చూపుతూ దరఖాస్తు చేసుకోవడంతో బదిలీలపై నిషేధాన్ని సడలిస్తూ ప్రభుత్వం సురేష్‌కుమార్‌ను తిరుపతికి బదిలీ చేసింది.

శెట్టిపల్లిలో రూ.19లక్షలతో మురుగు కాల్వలు



తిరుపతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని సప్తగిరి లేఅవుట్‌లో రూ.19 లక్షలతో మురుగుకాల్వల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈనెల 14న ఆంధ్రజ్యోతిలో 'శెట్టిపల్లిలో సమస్యల జాతర' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. 470 మీటర్ల విస్తీర్ణంతో కాలువలు ఏర్పాటు చేస్తున్నారు. నెల రోజుల్లో పూర్తి చేస్తామని గ్రామ సచివాలయ కార్యదర్శి ఎస్.మురళి, ఈఈ హేమాద్రి తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



సతీష్ మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 24(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి చెందిన ఘటనపై తిరుపతి రూరల్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి సీఐ చిన్నగోవిందు సోమవారం తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ ఎన్టీఆర్ కాలనీకి చెందిన వేమూరు వెంకటస్వామి రెండో కుమారుడు సతీష్(35) ఎంఏ పూర్తి చేశాడు. సంగీతం క్లాసులు నిర్వహిస్తున్నాడు. మూడేళ్ల కిందట చిత్తూరు జిల్లా యాదమరి మండలం కొత్తపల్లికి చెందిన దుర్గతో ఇతడికి వివాహమైంది. వీరికి సంతానం లేదు. ఈ క్రమంలో క్షుద్రపూజలు చేసే విజయ్ ఇతడికి పరిచయమయ్యాడు. సతీష్ దంపతులు, విజయ్ ఏడాది పాటు కనిపించకుండా పోయారు. ఈ విషయమై సతీష్ కుటుంబ సభ్యులు గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతపురం జిల్లా కదిరిలోని విజయ్ ఇంట్లో దుర్గ, సతీష్ ఉంటున్నారని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని పోలీసులకు చెప్పారు. ఇంతలో సతీష్ మృతదేహాన్ని తీసుకుని దుర్గ పుట్టింటికి వెళ్లింది. వాళ్లు నిరాకరించడంతో అత్తారింటికి తీసుకొచ్చింది. తమ కుమారుడిని విజయ్, దుర్గ చంపేశారంటూ పద్మ తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ షేక్‌షావలి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'డంపింగ్ పంచాయితీ'కి తెర

● ఐదు భాగాలుగా విభజన



డంప్‌యార్డ్

తిరుపతి అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మంగళం డంపింగ్ యార్డ్ విషయంలో పారిశుధ్య కార్మికుల మధ్య ఏర్పడిన వివాదానికి అధికారులు పరిష్కారం చూపారు. ఎస్వీ సీఈ కళాశాల వెనుక 2.02ఎకరాల్లో డంపింగ్‌యార్డు(ప్రస్తుతం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ఉంది. సప్తగిరికాలనీ, రణధీరపురం, మంగళం 2, తిరుమలనగర్, శెట్టిపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో సేకరించిన చెత్తను ఇక్కడికి తరలిస్తారు. క్రమేణా చెత్త పెరుగుతుండడంతో స్థలాభావం ఏర్పడింది. పైగా దాన్ని వేరు చేయడంలో పారిశుధ్య కార్మికుల మధ్య వివాదం నెలకొంది. తరచూ సమస్య తలెత్తుతుండడంతో ఈ పంచాయితీ డివిజన్ పంచాయతీ అధికారి బి.సురేష్‌నాయుడు వద్దకు చేరింది. ఆయన గత సోమవారం సర్వేయర్లతో ఐదుపంచాయతీలకు జనాభా నిష్పత్తి ప్రకారం డంప్‌యార్డ్ స్థలాన్ని విభజించారు. పంచాయతీ కార్యదర్శులకు దాన్ని చూపించి, ఎవరికివారు నిర్వహించుకోవాలని ఆదేశించారు. దీంతో సమస్యకు పరిష్కారం లభించినట్లయింది.

స్విమ్స్‌లో హడలెత్తించే ఆమెపై బదిలీ వేటు

● నర్సింగ్ సూపరింటెండెంట్ నుంచి హాస్టల్ వార్డెన్‌గా బదిలీ

తిరుపతి, మార్చి4(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో నర్సింగ్ సిబ్బందిని హడలెత్తించే డిప్యూటీ డైరెక్టర్ (నర్సింగ్) ప్రభావతిపై బదిలీ వేటు పడింది. నర్సింగ్ సూపరింటెండెంట్ బాధ్యతలనుంచి తప్పించి వైద్య విద్యార్థునుల హాస్టల్ వార్డెన్‌గా నియమిస్తూ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత వైసీపీ హయాంలో ఆమె వ్యవహరించిన తీరు, నర్సింగ్ సిబ్బందిని వేధిస్తున్న ఘటనలపై 'ఆమె అంటే హడల్' శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై అధికారులు విచారణకు ఆదేశించారు. తిరుపతినుంచి పలువురు పెద్దఎత్తున సీఎంవోకు ఫిర్యాదులు చేశారు. దీంతో స్విమ్స్‌లోని కొందరు అధికారులు ఆమెకు మద్దతుగా దిగి ప్రశ్నావళితో ఫెస్సీ వర్కర్లు(వార్డు బాయ్స్), ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వో, సీఎస్‌సీఎస్‌డీ సిబ్బంది నుంచి వివరణ తీసుకున్నారు. కొందరి నుంచి బలవంతంగా అభిప్రాయాలు తీసుకున్నట్టు విమర్శలు వచ్చాయి. ఈక్రమంలో సోమవారం జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశం అనంతరం ఛైర్మన్ బీఆర్ నాయుడు స్విమ్స్ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి ప్రభావతిని నర్సింగ్ సూపరింటెండ్ బాధ్యతలు నుంచి తప్పించాలని ఆదేశించినట్టు తెలిసింది. సోమవారం నుంచే ఆదేశాలు అమలయ్యేలా అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆమెస్థానంలో గ్రేడ్-1నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉన్న సునీతకు బాధ్యతలు ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యూడీఎస్ మరమ్మతులతో వాహనాల రాకపోకలకు అంతరాయం

తిరుపతి, మార్చి24(ఆంధ్రజ్యోతి) : తిరుమల బైపాస్ రోడ్డులోని 47వ నంబర్ పిల్లర్ వద్ద భూగర్భ డ్రైనేజీ కాలువ మరమ్మతులు చేయనుండడం వలన వాహనాల రాకపోకలకు అంతరాయం కలగనుందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల బైపాస్ రోడ్డులోని ఎస్కే ఫాస్ట్‌ఫుడ్ సమీపంలో యూడీఎస్ లీకేజి రావడంతో పైప్‌లైన్ పూర్తిగా తవ్వి మరమ్మతులు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ఐదు రోజులపాటు పనులు జరగనున్నాయని, వాహన చోదకులు, ప్రజలు సహకరించాలని కోరారు.

కాలుష్య నియంత్రణ బోర్డు పోస్టులకు నేటి నుంచి పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ-ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డులో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, అనలిస్టు గ్రేడ్ 2, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించిన పరీక్షలు మంగళ, బుధ, గురువారాల్లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. జిల్లాలో ఈ పరీక్షలకు రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్సులో పరీక్షలు జరుగుతాయన్నారు. ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

మెడికల్ రెప్రజెంటేటివ్‌లపై దాడి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కనకభూషణ లేఅవుట్‌లో ఇద్దరు మెడికల్ రెప్రజెంటేటివ్‌లపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఇనుపరాడ్‌తో తలపై కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితులు అలిపిరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కలికిరికి చెందిన మనోజ్‌కుమార్ తిరుపతిలో మెడికల్ రెప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. అతనితో పాటు మరొక వ్యక్తి పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చి ద్విచక్ర వాహనం పార్కింగ్ చేస్తుండగా అటుగా ఒక యువకుడు వచ్చాడు. ఎవరా అని చూస్తుండగా మరో వ్యక్తి వచ్చి 'అతన్ని ఎందుకు చూస్తున్నావు.. అతనితో నీకేమీ పని' అంటూ దాడి చేశాడు. మనోజ్‌కుమార్ గట్టిగా అరవడంతో పక్కనే ఉన్న మరొక వ్యక్తి వచ్చి ఆటోలో ఉన్న ఇనుప రాడ్ తీసుకుని తలపై మోదాడు. మరొక రెప్రజెంటేటివ్ గట్టిగా కేకలు వేయడంతో అతనిపైనా దాడి చేశారు. గాయపడిన రెప్రజెంటేటివ్‌లు ఇద్దరూ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందారు. సోమవారం ఉదయం అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డికి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఈసీ మార్గదర్శకాల మేరకే ఓటరు జాబితా

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల తుది జాబితా తయారు చేసినట్లు డీఆర్వో నరసింహులు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా తయారీ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ బీఎల్వోలు డోర్ టూ డోర్ వెరిఫికేషన్ చేసిన తర్వాతనే తుది జాబితాను ఈసీకి పంపామని తెలిపారు. నేతలు ఇచ్చే సూచనలు, సలహాలను ఈసీకి పంపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వీఎల్టీ ఉన్నవాటికే టీడీఆర్ బాండ్లు

● పన్ను కట్టని ఖాళీ స్థలాలకు ప్రభుత్వ భూములని బోర్డులు పెడతామన్న కమిషనరు



మౌర్య

తిరుపతి, మార్చి24(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ రోడ్లకు వ్యాకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్టీ) చెల్లించిన వారికే టీడీఆర్ బాండ్లు ఇస్తామని కమిషనర్ ఎన్.మౌర్య స్పష్టంచేశారు. సోమవారం ఆమె కార్పొరేషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కార్పొరేషన్‌కు వీఎల్టీ చెల్లించకుండా టీడీఆర్ కావాలని తిరిగితే ప్రయోజనం లేదన్నారు. టీడీఆర్ బాండ్లకు సంబంధంలేని నగరంలోని ఖాళీ స్థలాలకు వీఎల్టీ కట్టలేదన్నారు. కొందరైతే తమ ఖాళీ స్థలానికి ఏమవుతుందిలే అన్న ధోరణిలో ఉన్నారని, స్పందన లేకపోతే ప్రభుత్వ భూమి అని బోర్డులు పెడతామన్నారు. ఇటీవల టీడీఆర్ బాండ్ల విచారణ కమిటీ దృష్టికి 9 కేసులు తీసుకెళితే ఒకదానికే అప్రూవల్ అయ్యిందన్నారు. స్థానిక విలువ ప్రకారం గిఫ్ట్ డీడ్ ఇవ్వాల్సి ఉంటుందని, అప్పుడే టీడీఆర్ బాండ్లు అప్రూవల్ అవుతాయన్నారు. 2019లో దరఖాస్తు చేసుకున్నవే ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ఇస్తున్నామన్నారు. 2013-14లో చేసుకున్నవి వస్తే ఇప్పుడు ఇవ్వలేమన్నారు. మళ్లీ ఎల్ఆర్ఎస్, బీపీఎస్ చేసుకోమని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన తర్వాతే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రూ.45 కోట్ల బకాయిలుంటే ఎలా?

నగరంలో ఆస్తిపన్ను రూ32కోట్లు, ఖాళీ స్థలాలు రూ8.07కోట్లు, నీటి పన్ను రూ5.50కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. మొత్తం 45.57కోట్లు పన్నుల బకాయిలు ఉంటే నగరాభివృద్ధి ఎలా సాధ్యమవుతుందో ప్రజలు అర్థంచేసుకోవాలన్నారు. రాజమండ్రి, నెల్లూరు పురపాలక సంఘాల్లో పన్నులు చెల్లించని వారికి నీరు, విద్యుత్‌కు కనెక్షన్లు తొలగిస్తున్నారని తిరుపతిలో ఇంకా ఆపరిస్థితి రాలేదన్నారు. మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉందని పన్నులు బకాయి ఉన్నవారు వెంటనే చెల్లించాలన్నారు. చెల్లించనివారికి నీరు, విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న ఏఎస్పీ నాగభూషణరావు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 24(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలసత్వమూ వద్దని ఏఎస్పీ రవిమనోహరాచారి స్పష్టం చేశారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 95 ఫిర్యాదులు వచ్చాయి. ప్రత్యేకంగా తొమ్మిది కౌంటర్లు ఏర్పాటు చేసి సీఐల ద్వారా వినతులు స్వీకరించారు. వికలాంగులు, వృద్ధుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. ట్రైనీ ఎస్పీ హేమంత్, ఏఎస్పీ నాగభూషణరావు, సీఐలు శ్రీనివాసులు, జయచంద్ర, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, రవీంద్ర, శేఖర్ బాబు, చిన్నగోవిందు, మురళీమోహన్‌రావు పాల్గొన్నారు.





నటుడు సుమన్

కోరుకున్నదానికన్నా దేవుడు ఎక్కువే ఇచ్చాడు

● సినీనటుడు సుమన్

తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): 'నేను కోరుకున్నదానికంటే దేవుడు నాకు ఎక్కువే ఇచ్చాడు' అని సినీనటుడు సుమన్ అన్నారు. ఎలాంటి సినిమా బ్యాగ్రౌండ్ లేని తాను తన తల్లిదండ్రులు చేసిన పుణ్యఫలంగా మంచి స్థాయికి ఎదిగానన్నారు. తన జీవితంలో ఏది జరిగినా, తాను ఏం చేసినా అది స్వామి లీలేనన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామిగా, శ్రీరాముడిగా, సత్యనారాయణస్వామిగా దేవుడి పాత్రల్లో నటించడం గొప్పవరమన్నారు. స్వామి ఆశీస్సులతో అనేక సినిమాల్లో తాను బిజీగా గడుపుతున్నానని చెప్పారు. తొలిసారిగా తుళు భాషలో నటిస్తున్నాని సుమన్ తెలిపారు. అలాగే కాంత, సత్యంగారి అబ్బాయి, ధర్మస్థల నియోజకవర్గం అనే మూడు సినిమాల్లో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నాని, ప్రస్తుతం 'కాంత' చిత్ర షూటింగ్ గుజరాత్‌లో జరుగుతోందన్నారు.

తిరుమలేశుని సేవలో శిరూర్ మఠాధిపతి



తిరుమల, మార్చి24 (ఆంధ్రజ్యోతి): ఉడిపిలోని శిరూర్ మఠాధిపతి వేదవర్ధనతీర్థ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అర్చక బృందం, పేష్కార్ రామకృష్ణ ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లిన స్వామి ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.94 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,198

తలనీలాలు సమర్పించినవారు: 25,665



ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం

నేటి నుంచి ముత్యాలమ్మ జాతర

● తూర్పుకనుపూరులో మొదలైన సందడి





బంగారుచీర అలంకరణలో అమ్మవారు (ఫైల్ ఫొటో) - పోలేరమ్మ (ఫైల్ ఫొటో)

చిల్లకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ జాతర మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం రాత్రి గంగమిట్ట మీద ఘటం నిలిపి కుమ్మరి తయారు చేసిన పోలేరమ్మ విగ్రహాన్ని రజకులు తీసుకొచ్చి తాటాకు గుడిసెలో తాత్కాలికంగా ప్రతిష్ఠంచడంతో జాతర మొదలవుతుంది. జాతరలో ముత్యాలమ్మతో పాటు పోలేరమ్మకూ భక్తులు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. జాతరలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాలో స్థిర పడిన వారు గ్రామాలకు చేరుకోవడం.. బంధుమిత్రుల రాకతో సందడి నెలకొంది. కాగా, మంగళవారం రాత్రి పోలేరమ్మ నిలుపు, 26న యార గురునాథస్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవం, గొల్లల వేడుకలు, 27న పగలు గురునాథస్వామి గ్రామోత్సవం, రాత్రి అమ్మణ్ణి ఉయ్యాల సేవ, 28న శుక్రవారం ఉదయం పోలేరమ్మను సాగనంపే ఉత్సవం, వేలం పాటలతో జాతర ముగుస్తుంది. ఈ జాతర కోసం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. జాతర ఏర్పాట్లను సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా పర్యవేక్షిస్తున్నారు.

భక్తులకు తగిన ఏర్పాట్లు

తూర్పు కనుపూరు జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమినాడు నుంచీ వేలాదిగా భక్తులు వస్తారు. వీరందరికీ తాగునీరు, వైద్యశిబిరాలు, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే అదనపు జనరేటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఆలయానికి ఇలా చేరుకోవాలి..

గూడూరుకు 30 కిలోమీటర్ల దూరంలో తూర్పుకనుపూరు ఉంది. గూడూరు, నెల్లూరు, వరగలి క్రాస్‌రోడ్డు, చింతవరం, కోట, నాయుడుపేట ప్రాంతాల్లో అందుబాటులో ప్రత్యేక బస్సుల ద్వారా చేరుకోవచ్చు.



కార్డుదారులకు 'ఈకేవైసీ' కష్టాలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 24(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులు ఈకేవైసీ కష్టాలతో సతమతమవుతున్నారు. ఈ నెలాఖరులోగా చేసుకోకుంటే రేషన్ కట్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో కార్డుదారులు రేషన్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. కార్డులోని కుటుంబ సభ్యులు (ఐదేళ్లపైబడిన వారు) వేలిముద్రలు వేసి ఆధార్ కార్డులకు లింక్ చేసుకోవాలి. ఒక్కో కార్డుకు సంబంధించి ముగ్గురు, నలుగురు వెళ్లాల్సి వస్తోంది. సర్వర్ సమస్యతో ఈకేవైసీ చేసుకోవడం ఆలస్యమవుతోంది. దీంతో గంటల తరబడి నిలబడుతున్నారు. తిరుపతిలోని ఎంఆర్‌పల్లె, ఇందిరానగర్, శివజ్యోతి నగర్, మధురానగర్, బాలాజీ కాలనీ, రైల్వే కాలనీ ప్రాంతాల్లో సర్వర్లు పనిచేయక నానా తంటాలు పడుతున్నారు. ఉదయం వెళ్లిన మధ్యాహ్నం వరకు పడి గాపులు కాస్తున్నా ఈకేవైసీ కావడంలేదు. ఒక్కోసారి సర్వర్ గంటల తరబడి పనిచేయక పోవడంతో ఆలస్యమవుతోందని డీలర్లు చెబుతున్నారు. ఈకేవైసీకి మిగిలిందిక ఏడు రోజులే. దీంతో కార్డుదారులు హైరానా పడుతున్నారు.



ర్యాలీ బృందంతో షార్ డైరెక్టర్ రాజరాజన్, ఇతర అధికార బృందం

తీర ప్రాంత భద్రతకు సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ

తడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో తీర ప్రాంతాల భద్రత కోసం సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సైక్లోథాన్ ర్యాలీ సోమవారం సూళ్లూరుపేటకు చేరింది. హోలిక్రాస్ కూడలి వద్ద జాతీయ రహదారిపై షార్, రెవెన్యూ అధికారులు, పోలీసులు వీరికి స్వాగతం పలికారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా తడ మండలం అక్కంపేట వద్దనున్న జైన్ టెంపుల్‌కు చేరుకొన్నారు అక్కడ ఇస్రో అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ర్యాలీ సిబ్బందికి షార్ డైరెక్టర్ రాజరాజన్, నాయుడుపేట డీఎస్పీ స్వాగతం పలికి అభినందించారు. మార్చి 7న కోల్‌కత్తా నుంచి ప్రారంభమైన సైక్లోథాన్ ర్యాలీ.. మార్చి 31న కన్నియాకుమారికి చేరడంతో ముగుస్తుందని శ్రీహరికోట సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సంజిత్ కుమార్ తెలిపారు. సముద్ర మార్గాల్లో ఉగ్రవాదుల చొరబాటు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు. అనంతరం ర్యాలీ తమిళనాడులోకి ప్రవేశించింది. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసుల రెడ్డి, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సత్యవేడులో మట్టి మాఫియాను అరికట్టండి

'సత్యవేడులో గ్రావెల్, మట్టి మాఫియా చెలరేగిపోతోంది. మట్టి లారీల వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి' అంటూ బీజేపీ నేతలు వెంకటేశ్వర్లు, మోహన్‌బాబు, శ్రీకాంత్, ప్రభు, శ్రీరాజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మట్టిని అక్రమంగా తమిళనాడుకు తరలించి రూ.కోట్లు గడిస్తున్నారన్నారు. పోలీసులు, అధికారులు పట్టించుకోవడం లేదని అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శెట్టిపల్లె భూసమస్యకు చొరవ చూపండి

శెట్టిపల్లె భూసమస్య పరిష్కారానికి చొరవ చూపి, తక్షణం జీవో విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డీఆర్వో నరసింహులును కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా పరిష్కారం చూపకపోవడం బాధాకరమన్నారు. అధికారులు పట్టించుకోకపోతే ఆందోళనకు దిగుతామన్నారు.

ముప్పావు శాతం భూసమస్యలపైనే

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 304 వినతులు ● గంట ముందే ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 304 అర్జీలు అందగా, అందులో 201 భూసమస్యలపైనే ఉన్నాయి. రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్‌లోను పదేపదే భూసమస్యలపై అర్జీలు వస్తున్నా పరిష్కారం పట్ల రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంగా ఉండటంతోనే వీటి సంఖ్య పెరుగుతోంది. ఇక, వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయం 9గంటలకే పీజీఆర్ఎస్ ప్రారంభమైంది. ప్రజల నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, పలువురు డిప్యూటీ కలెక్టర్లు అర్జీలు స్వీకరించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అర్జీ తీసుకోనని చెప్పారు



'మీతో మాట్లాడను. మీ అర్జీ తీసుకోను. వెళ్లిపోండి' అని జేసీ శుభం బన్సల్ తమను అనడం బాధించిందని నాయుడుపేటకు చెందిన తీగల రాజేశ్వరి, భాస్కర్ దంపతులు మీడియాతో అన్నారు. పుదూరు గ్రామంలో 1.80ఎకరాలు సాగరమాల రోడ్డుకు భూసేకరణకు అడగ్గా.. తగిన పరిహారం ఇవ్వాలని లేదా అంతే భూమిని ఎక్కడైనా ఇవ్వాలని అటు ఆర్డీవో, ఇటు తహసీల్దారును కోరామన్నారు. వారి నుంచి నిర్లక్ష్యంగా సమాధానం రావడంతో కోర్టును ఆశ్రయించామని చెప్పారు. ఇదే విషయంపై పీజీఆర్ఎస్‌లో జేసీకి అర్జీ ఇవ్వగా.. ఇలా మాట్లాడం బాధకలిగించిదన్నారు. అంతకు ముందు అధికారులతో వీరికి వాగ్వాదం చోటు చేసుకుంది.

రోడ్డున పడ్డాం.. ఆదుకోండి

తిరుపతి ఎస్‌బీఐ కాలనీకి చెందిన రేణుక తన ఇద్దరు పిల్లలతో పాటు తల్లితో అద్దె ఇంట్లో ఉంటున్నారు. రెండు నెలల క్రితం ఆమె భర్త మోహన్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఇద్దరు బిడ్డలు, వృద్ధురాలైన తల్లిని తీసుకుని కలెక్టరేట్‌లో అధికారులను కలిశారామె. 'అద్దె ఇంటి వారు ఖాళీ చేయాలంటున్నారు. నా ఆరోగ్యం సరిగా లేదు. భర్త మరణించడంతో రోడ్డున పడ్డాం. వితంతు పింఛనుతో పాటు నా బిడ్డల చదువుకు ఆసరా కల్పించండి' అంటూ ఆమె అధికారులను ప్రాధేయపడ్డారు. డీఆర్వో నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు ఆమెను ఓదార్చి మే నెల నుంచి వితంతు పింఛను ఇచ్చేలా, పిల్లలకు బీసీ హాస్టల్‌లో చదువుకోవడానికి వెంటనే అవకాశం కల్పించాలని, ఆర్థికంగా ఎదగడానికి భరోసా కల్పించాలని అధికారులను ఆదేశించారు.



డీఆర్వో ఎదుట కన్నీరుమున్నీరు అవుతున్న రేణుక

నాయుడుపేటలో వైసీపీకి భారీ షాక్

● పార్టీ వీడిన ముగ్గురు కౌన్సిలర్లు, మరికొందరు నేతలు



ఎమ్మెల్యే విజయశ్రీ, నరసింహయాదవ్, నెలవల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

నాయుడుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో వైసీపీకి షాక్ తగిలింది. ముగ్గురు కౌన్సిలర్లు, నాయకులు ఆ పార్టీని వీడి.. సోమవారం రాత్రి టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సమక్షంలో ఆ పార్టీలో చేరారు. 2021 ఎన్నికల్లో 25కు 23 మంది కౌన్సిలర్లు వైసీపీ నుంచి గెలిచారు. ఎన్నికల సమయంలో వైస్ చైర్మన్ రఫీ టీడీపీలో చేరారు. వైసీపీలో గ్రూపు రాజకీయాలతో కొందరు నాయకులు, కౌన్సిలర్లు సతమతమవుతూ వచ్చారు. ఈ క్రమంలో సోమవారం కౌన్సిలర్లు మల్లు నీరజ, ఆబోతుల మస్తానమ్మ, కరీంబాయి విజయలక్ష్మితో పాటు మొదలియార్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కరీంబాయి చెంచయ్య, జువ్వలపాళెం సర్పంచ్ రమణయ్య, మాజీ కౌన్సిలర్ ఆబోతుల బాబు, వైసీపీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తెమ్మాని హరిరెడ్డి, సీహెచ్ రాజేష్ తదితరులు టీడీపీలో చేరారు.

హరియాణా మద్యం కేసులో కారు డ్రైవర్ ఎక్కడ?

● ప్రధాన పాత్రధారిని పట్టుకోవడంలో మీనమేషాలు

● ఎక్సైజ్ అధికారుల దర్యాప్తుపై విమర్శలు ● ఇప్పటికీ సాగుతున్న మద్యం దందా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హరియాణా మద్యం కేసులో ప్రధాన పాత్రధారి, కారు డ్రైవరు చల్లా శ్రీనివాసులురెడ్డి ఎక్కడ? 11 రోజులుగా ఇతడు దొరకలేదా? అతడిని పట్టుకునే దిశగా గట్టి ప్రయత్నాలు జరగలేదా? ఇదీ ఈ కేసుకు సంబంధించి ఎదురవుతున్న ప్రశ్నలు. హరియాణాలో అతి తక్కువకు మద్యం దొరకడం.. ఇక్కడితో పోలిస్తే దాదాపు రూ.700 వ్యత్యాసం ఉండటంతో దీనిని అక్రమ సంపాదనగా మార్చుకున్నాడు ఆ రాష్ట్రానికి చెందిన గజేంద్ర శర్మ. తిరుపతిలో ఉంటున్న కూల్‌డ్రింక్ షాపు యజమాని బాబునూ భాగస్వామిగా చేసుకున్నాడు. గజేంద్రశర్మకు అన్ని విధాలుగా రూట్ అధికారిగా ఉంటూ, అన్నీ తానై ముందుండి నడిపించాడు కారు డ్రైవర్ చల్లా శ్రీనివాసులురెడ్డి. ఢిల్లీ మీదుగా మద్యాన్ని తీసుకొచ్చి గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, తిరుపతిలలో విక్రయించేవారు. ఈ క్రమంలో ఈనెల 13వ తేదీన ఎక్సైజ్ అధికారులు ముందస్తు ప్లాన్‌తో భారీ ఎత్తున హరియాణా మద్యం స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారి, హరియాణాకు చెందిన గజేంద్ర శర్మ, కూల్‌డ్రింక్ షాపు దుకాణదారు బాబును అరెస్టు చేశారు. అప్పట్నుంచి కారు డ్రైవరు శ్రీనివాసులురెడ్డిని పట్టుకోలేకున్నారు. సమగ్ర విచారణతో ఇతడిని పట్టుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు.. ఆ దిశగా చర్యలు లేవన్న విమర్శలు వినవస్తున్నాయి. మరోవైపు ఇద్దరు అరెస్టయినా, హరియాణా మద్యం విక్రయాలు మాత్రం ఆగలేదు. తిరుపతిలోని గజేంద్రశర్మ అనుచరులు ఇద్దరు ఆదివారం సత్యనారాయణపురంలోని ఇద్దరికి హరియాణా మద్యం విక్రయించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇలా అక్రమంగా నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం అక్రమాలు సాగడం వెనుక కొంతమంది పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది హస్తం ఉందన్న ప్రచారమూ జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు దర్యాప్తులో వేగం పెంచి కారు డ్రైవరును అదుపులోకి తీసుకుని.. హరియాణా మద్యం వ్యాపారాన్ని అరికట్టాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ కానిస్టేబుళ్ల సంఘం అధ్యక్షుడిగా రామచంద్రయ్య

● ఉపాధ్యక్షుడిగా జయశంకర్



డీసీ విజయశేఖర్‌ను కలిసిన నూతన కార్యవర్గం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్ళ, కానిస్టేబుళ్ల సంఘం నూతన అధ్యక్షుడిగా తిరుపతి ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటులో హెడ్ కానిస్టేబుల్ ఎస్.రామచంద్రయ్య ఎన్నికయ్యారు. సోమవారం తిరుపతిలో సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కానిస్టేబుల్ జయశంకర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా కె.వేణుగోపాల్, కోశాధికారిగా పి. అయ్యప్ప రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భారతి రాజా, సంయుక్త కార్యదర్శులుగా ఎ.సురేంద్రబాబు, ఎస్.శ్రావణి, ప్రెస్ కార్యదర్శులుగా ఎస్. రమేష్, ఆర్. నాగరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా శాలక్ష్మి, గాయత్రి, బోసుకుమార్, విజయ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా చిత్తూరు ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి, ఎన్‌ఫోర్సుమెంటు ఏఈఎస్ సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. ఎక్సైజ్ డీసీ విజయశేఖర్, ఏసీ శ్రీనివాసులును నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది.

తాత్కాలిక మెడికల్ కౌన్సిల్‌లో తిరుపతి వైద్యుడికి చోటు

తిరుపతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ తాత్కాలిక మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా తిరుపతి వైద్యుడు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు నియమితులయ్యారు. ప్రముఖ రేడియాలజిస్టు అయిన ఈయన గతంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. కొంతకాలంగా రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ నియామకం జరగలేదు. రోజువారీ కార్యలాపాల నిర్వహణ కష్టంగా మారడంతో ప్రభుత్వం సోమవారం తాత్కాలిక ప్రాతిపదికన కౌన్సిల్‌ను ఏర్పాటు చేసింది. అందులో వైద్య కళాశాలల నుంచీ బోధనా సిబ్బంది కోటాలో ఇద్దరిని.. రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కోటాలో నలుగురిని నియమించింది. రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కోటా నుంచీ శ్రీహరిరావు ఎంపికయ్యారు.

ఎర్రచందనం స్మగ్లర్‌పై పీడీ యాక్ట్



శివమణి గోవింద

మంగళం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా జమునమిత్తూరు మండలం నల్లపట్టు గ్రామానికి చెందిన శివమణి గోవిందం(35) అలియాస్ శివమణిపై పీడీయాక్ట్ అమలుకు ఆదేశాలు జారీ అయ్యాయని టాస్క్‌ఫోర్సు హెడ్ సుబ్బరాయుడు తెలిపారు. శివమణిపై పీడీయాక్టు అమలుకు సిఫార్సు చేయగా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్ అనుకూలంగా స్పందిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ క్రమంలో శివమణిని కడప సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి

మంగళం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శేషాచల కొండల్లో ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సీసీఎఫ్ సెల్వం సూచించారు. తిరుపతి బయోట్రీమ్‌లో సోమవారం జరిగిన అటవీ శాఖ, టాస్క్‌ఫోర్సు అధికారుల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి శేషాచల అడవుల్లకి వస్తున్న స్మగ్లర్లను ముందుగానే పసిగట్టి కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డ వారిపై పీడీయాక్టు ప్రయోగించాలన్నారు. ఇపుడు స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డ వారికి కఠిన శిక్షలు పడుతున్నాయన్నారు. తిరుపతిజిల్లా అటవీశాఖ అధికారి వివేక్, టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు, మూడు సర్కిళ్లలోని అధికారులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ఆక్రమణల నుంచి శ్మశానాన్ని కాపాడండి

పుత్తూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆక్రమణల గురైన గట్టు వడ్డిండ్ల శ్మశానాన్ని కాపాడాలని కోరుతూ సీపీఎం ఆధ్వరంలో గ్రామస్తులు పుత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ నేసనూరు సర్వే నెం.605లోని స్థలాన్ని వడ్డెరలు శ్మశానంగా వినియోగిస్తున్నారని తెలిపారు. ఆ శ్మశానం పక్కన ఉన్న సునీల్ దాన్ని ఆక్రమించాడని , రెవిన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందించారు.

విద్యుత్ సదస్సులో 45 ఫిర్యాదులు

పుత్తూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు విద్యుత్ డివిజన్ వినియోగదారుల సదస్సులో 45 ఫిర్యాదులు అందగా వెంటనే పది సమస్యలను పరిష్కరించామని డివిజనల్ ఇంజనీర్ ఆశీర్వాదం తెలిపారు. డివిజన్‌లోని 11 విద్యుత్ ఉపకేంద్రాల వద్ద సోమవారం సదస్సులు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఏడీఈ శంకరయ్య, నాగలాపురం ఏడీఈ రమేష్, ఏఈలు పాల్గొన్నారు.

నేటినుంచి విద్యుత్ సదస్సులు

వడమాలపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు సబ్‌స్టేషన్ల పరిధిలో ఈనెల 25నుంచి విద్యుత్ సమస్యల పరిష్కార సదస్సులు జరుగుతాయిన ఏడీఏ శంకరయ్య చెప్పారు. ఈనెల 25న మంగళవారం ఉదయం వడమాలపేట, మధ్యాహ్నం పూడిలో, 26న బుధవారం ఉదయం అప్పలాయగుంట, మధ్యాహ్నం ఏఎంపురంలో, 27న గురువారం ఉదయం పాదిరేడు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించాలని చెప్పారు.

అప్పలాయగుంటలో అనధికార బంకు

రాకపోకలకు అంతరాయం



వడమాలపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అప్పలాయగుంట బస్టాండు వద్ద అక్రమంగా బంకు ఏర్పాటు చేశారు. ఆర్ అండ్ బీ రోడ్డు, తామరగుంట స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేశారు. బస్టాండు కూడలి కావడం, ఆలయానికి వచ్చే వాహనాలతో కూడలి రద్దీగా ఉంటుంది. శనివారం, ముఖ్యమైన పర్వదినాల్లో వందలాది వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. పరిసరాల నుంచి భక్తులు భారీగా వాహనాల్లో వస్తుంటారు. బంకు కారణంగా రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇలాకే కొనసాగితే మరిన్ని అనధికార బంకులతో తామరగుంట ఆక్రమణలకు గురయ్యే అవకాశం ఉంది. దీంతో రోడ్డు కుచించుకుపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి బంకును తొలగించాల్సి ఉంది.

క్షయ వ్యాధి నిర్మూలన ర్యాలీ

వడమాలపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినం సందర్భంగా వడమాలపేట ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. క్షయ పట్ల అప్రమత్తంగా ఉండలని, ముందస్తు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని కరపత్రాలను అందించారు. ర్యాలీలో వైద్యాధికారి చక్రపాణి, సీహెచ్‌వో పురుషోత్తం రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రమోహన్, స్టాఫ్‌నర్స్ మంజుల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీ4ని విజయవంతం చేయండి

పుత్తూరు టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి4 సర్వేకు ప్రజలు సహకరించాలని తడుకు సర్పంచ్ వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం తడుకు పంచాయతీ సచివాలయంలో పీ4 కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి నరేష్, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే

పుత్తూరు అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో స్వచ్ఛత, పారిశుధ్యంపై స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సర్వే చేపట్టింది. ఈ సర్వే గత ఐదు రోజులుగా సాగుతోంది. సోమవారంతో ముగిసింది. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారానే స్వచ్ఛ భారత్ మిషన్ పట్టణ ప్రాంతాలకు ర్యాంకింగ్‌లు ప్రకటించనుంది. గతంలో జరిగిన విధంగానే తడి, పొడి చెత్త వేర్వేరు చేయడం, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, సంక్షేమ సంఘాల భాగస్వామ్యం, బహిరంగ మలవిసర్జనపై చర్యలు, స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు, ప్రమాదకర ప్లాస్టిక్ రహితం కోసం చేపడుతున్న చర్యలను స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించింది. ఈ బృందం వెంట మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

రేణిగుంట, మార్చి 24, (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తారకరామ నగర్, కరకంబాడి, రేణిగుంటల్లో గృహ సముదాయాలకు వినియోగించే విద్యుత్తుని వాణిజ్య దుకాణాలకు వినియోగించడాన్ని గుర్తించారు. 10 కనెక్షన్లను వాణిజ్య మీటర్లుగా మార్చారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఈఈ గంగాధర్ రెడ్డి, ఏఈ కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

భాగ్యశ్రీకి ఉత్తమ క్యాడెట్ అవార్డు



పిచ్చాటూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తులసి కృష్ణాపురం పంచాయతీ పాత గొల్లకండ్రిగకు భాగ్యశ్రీకి ఎన్‌సీసీ ఉత్తమ క్యాడెట్ అవార్డు వరించింది. శ్రీ పద్మావతి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్న భాగ్యశ్రీ 2024-25 సంవత్సరానికి గానూ ఈ అవార్డును ఎన్‌సీసీ 5 ఆంధ్రా బాలికల బెటాలియన్ తరఫున తిరుపతి ఎన్‌సీసీ బెటాలియన్ చీఫ్ చేతుల మీదుగా అందుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సామాజిక చైతన్య కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని బాలికల్లో ఉత్తేజాన్ని నింపుతానని చెప్పారు.

శ్రీసిటీ - కెలాగ్స్ వితరణ

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతుల కల్పన



వరదయ్యపాళెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పిల్లలకు చదువుతో పాటు ఆటలు ఎంతో ముఖ్యమని గుర్తించిన శ్రీసిటీ ఫౌండేషన్, స్థానిక పరిశ్రమల సహకారంతో పరిసర ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రీడావసతుల కల్పనపై దృష్టి సారించింది. అందులో భాగంగా మాదనపాళెం, ఇరుగుళం జడ్పీ ఉన్నత పాఠశాలలు, రామచంద్రాపురం, గొల్లవారిపాళెం, వానెల్లూరు ప్రాథమిక పాఠశాలల్లో క్రీడా వసతులను కెలాగ్స్ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో భాగంగా సుమారు రూ.8లక్షలు వెచ్చించి క్రీడా పరికరాలను అమర్చారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



వరదయ్యపాళెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధిలో భాగంగా మండలంలోని పలువురుకి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. అందులో కల్లూరు సుదేవ్‌కు రూ.1,52,306, కిలారి మాధవనాయుడికి రూ.30వేలు, అశోక్‌కు రూ.20వేలు చెక్కులను టీడీపీ నాయకులు అందజేశారు. టీడీపీ నాయకులు నిర్మల్, పవన్‌కుమార్, హరిప్రసాద్, దశరథన్, ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఈ నెల 27, 29 తేదీల్లో పలు రైళ్ల రద్దు

తడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27, 29 అంటే వచ్చే గురువారం, శనివారం రెండు రోజులపాటు పలు రైళ్ల రద్దుకానున్నట్లు చెన్నై సదరన్ రైల్వే అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు పొన్నేరి, కవరపేట రైల్వే స్టేషన్‌ల మధ్య కొంత కాలంగా పట్టాల మార్పిడి, సిగ్నలింగ్ వ్యవస్థ బలోపేతం వంటి ఇంజనీరింగ్ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా వచ్చే గురు, శనివారాలలో రెండు రోజులపాటు మధ్యాహ్నం 1.20 నిమిషాల నుంచి సాయంత్రం 5.40 నిమిషాల వరకు ఆ పనులను కొనసాగించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో సూళ్లూరుపేట నుంచి ఉదయం 8.10 నిమిషాలకు నెల్లూరుకు బయలుదేరి వెళ్లే మెమో రైలు, 10.30 గంటలకు నెల్లూరు నుంచి చెన్నైకు బయలుదేరి వెళ్లే మెమో రైలుతోపాటు చెన్నై, సూళ్లూరుపేట, చెన్నైల మధ్య నడిచే పలు సబర్బన్ రైళ్లను పూర్తిగా రద్దుచేశారు. రద్దు అయిన రైళ్లలో సూళ్లూరుపేట నుంచి చెన్నైకు మధ్యాహ్నం 12.35, 1.10 నిమిషాలు, 3.10 నిమిషాలకు బయలుదేరి వెళ్లే సబర్బన్ రైళ్లు ఉన్నాయని సదరన్ రైల్వే అధికారులు ప్రకటించారు.

ద్విచక్ర వాహనం సీజ్

వెంకటగిరిటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలో ఓ బాలుడు తన బైక్‌కు సైలెన్సర్ మార్చి అధిక శబ్దంతో నడపడంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. అలాగే ఆ వాహనాన్ని కూడా సీజ్ చేశారు. ఎస్‌ఐ సుబ్బారావు మాట్లాడుతూ పట్టణంలోని అధిక శబ్దం వస్తున్న వాహనాలను సీజ్ చేస్తున్నామని తెలిపారు. అలాగే యువత క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని కోరారు.

మేత పోరంబోకు స్థలంలో రోడ్డు నిర్మాణం ఆపాలి: కాంగ్రెస్

చిల్లకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదనం గ్రామంలో మేత పోరంబోకు స్థలంలో ఓ పరిశ్రమ అక్రమంగా చేపట్టిన రోడ్డు నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి కోరారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏపీవోగా జ్యోతి

బాలాయపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి ఏపీవో జ్యోతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె వడమాలపేట మండలం నుంచి ఇక్కడికి వచ్చారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ఏపీవో ఆశారాణి పాకాలకు వెళ్లారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టండి

డక్కిలి, మార్చ 24 : (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిం చారు. ఇందులో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న రాణి, వీఆర్వోలు, పాల్గొన్నారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.23 లక్షలు



సూళ్లూరుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం 47 రోజులకుగాను రూ.23,11,485 నగదు, బంగారు 95 గ్రాములు, వెండి 50 గ్రాములు వచ్చిందని సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ తెలిపారు. విదేశీ కరెన్సీ యుఎస్‌ఏ డాలర్స్ 20, మలేషియా రింగట్స్ 1, కెనడా డాలర్స్ 20 వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస బాబు సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు రూ.11లక్షల ఆదాయం



చిల్లకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసివున్న ముత్యాలమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 112 రోజులకు గాను భక్తులు హుండీలో వేసిన కానుకల ద్వారా రూ. 11,85,692 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాం దేవస్థానం ఈవో శశాంక్, సురేంద్రరెడ్డి, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఎదుట మురుగునీటితో నిరసన



నాయుడుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సి పాలిటీ పరిధిలోని భూపయ్యకాలనీలో మురుగునీటి కాలువలు నిర్మించాలని కాలనీలోని గిరిజనులు కోరారు. ఈ మేరకు సోమవారం మురుగునీటితో వచ్చి మున్సిపాలిటీ ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఐయూ మండల కార్యదర్శి శివకవిముకుంద మాట్లాడుతూ కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం కమిషనర్ ఫజులుల్లాకు వినతిపత్రం అందించారు. సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు రూ. 26.32 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఎవరైనా వైద్యం కోసం ఇబ్బందులు పడుతుంటే స్థానిక కార్యాలయాన్ని సంప్రదించి సీఎం సహాయనిధి ద్వారా లబ్ధిపొందవచ్చునన్నారు. అనంతరం టీడీపీ సభ్యత్వ కార్డులను అందజేశారు. శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, మట్టం శ్రావణి, వెంకటేశ్వర్లురెడ్డి, పెంచలయ్య, సురేంద్ర, చైతన్య పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేట టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి పలువురు లబ్ధిదారులకు 73.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే విజయశ్రీ అందజేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, టీడీపీ నాయకులు సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సంచి కృష్ణయ్య, కట్టా రమణారెడ్డి, వేమసాని శ్రీనివాసులు నాయుడు, షైలారి రాజశేఖర్, గంగాప్రసాద్, జీవీఆర్ నాయుడు తదితరులు ఉన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నరసింహయాదవ్, నెలవల తదితరులు

సమస్యల పరిష్కారానికి కృషి

తడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం మండల పరధిలోని అండగుండాల గ్రామంలో ఆమె టీడీపీ నాయకులతో కలసి పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను, రోడ్ల నిర్మాణ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు మంజూరు చేస్తామన్నారు. అంతకు ముందు ఆమె టీడీపీ నాయకులతో కలిసి అక్కంపేట నుంచి అండగుండాల వరకు ఉన్న రోడ్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కామిరెడ్డి మురళిరెడ్డి, శెల్వం, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, వేనాటి జనార్ధన్ రెడ్డి, నీలకంఠం, వేనాటి రాజారెడ్డి, కళానిధి, జీవా, విజయమ్మ, టీకే రవి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తు



రైతుల సమస్యలు తెలుసుకొంటున్న ఏఈ మోహిని పక్కనే సిబ్బంది

సూళ్లూరుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ ఏఈలు పూర్ణిమ, మోహిని దేవి తెలిపారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు, మండల పరిధిలోని మన్నెముత్తేరి సబ్‌స్టేషన్లలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని అధికారుల దృష్టికి తెచ్చారు. ఏఈలు స్పందిస్తూ వ్యవసాయానికి 9 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

మన్నెముత్తేరి సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సూళ్లూరుపేట రూరల్ ఏఈ మోహిని ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఈ సబ్‌స్టేషన్‌లో పరిధి లోని పిండిపాళెం, ఆబాక, మన్నెముత్తేరి, సర్వారెడ్డికండ్రిగ, సామంతమల్లాం తదితర గ్రామాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ఉరుసు నిర్వహణకు అందరూ సహకరించాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం, రఫీ, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

నాయుడుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేటలోని హజరత్ అమీర్‌షావలి దర్గా 74వ ఉరుసు నిర్వహణకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కోరారు. నాయుడుపేట హజరత్ అమీర్‌షావలి దర్గా వద్ద సోమవారం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉరుసు గంధోత్సవ వాల్ పోస్టర్లను నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల, సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తదితర నాయకులతో కలసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ ఉరుసు గంధోత్సవం 9 సంవత్సరాల విరామం తర్వాత దర్గా వ్యవస్థాపక కమిటీ సభ్యులు, వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహించనుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దోర్నాదుల వాసు, నిజాం, లక్ష్మీపతి, రషీద్, చంద్రశేఖర్, సుభానీ, నాయకులు పార్థసారథి, నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్, అవధానం సుధీర్, గంగాప్రసాద్, నానాబాల సుబ్బారావు, రవి, పసల చెంగయ్య, జీవీఆర్ నాయుడు తదితరులు ఉన్నారు.

అభ్యంతరాలుంటే చెప్పండి

కోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నష్టపరిహారం విషయంలో అభ్యంతరాలుంటే చెప్పాలని చెన్నై-బెంగళూరు కోస్టల్ కారిడార్‌తో భూములు కోల్పోతున్న కొత్తపట్నంలోని రైతులను రెవెన్యూ అధికారులు కోరారు. మండల పరిధిలోని కొత్తపట్నంలో సోమవారం చెన్నై-బెంగళూరు కోస్టల్ కారిడార్ భూములకు సంబంధించి అభ్యంతరాలపై రెవెన్యూ బృందాలు పరిశీలన ప్రారంభించాయి. కోట, బాలయ్యపల్లి తహసీల్దారులు జయజయరావు, శ్రీనివాసులు వడమాలపేట డిప్యూటీ తహసీల్దారు సుధీర్ ఆర్‌ఐలు శ్రీకాంత్, మధులత, సర్వేయర్ గోపీరెడ్డి, బ్రహ్మయ్య, వీఆర్వో వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, భూపరిహారంపై పరిశీలన చేశారు. భూములు కోల్పోయే రైతుల జాబితాను ప్రకటించారు. ఎకరాకు ప్రభుత్వం రూ.8 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు వివరించారు.



కొత్తపట్నంలో రైతుల వివరాలను సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాల యంలో సీపీఐ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ నాన్ టీచింగ్ సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేషా, శశికుమార్, ఆదెయ్య, వెంట్రామిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

క్రీడా విజేతలకు అభినందన

కోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళా శాలలో సోమవారం 12వ జేఎన్‌టీయూఏ అంతర్ కళాశాల క్రీడా పోటీలలో పాల్గొన్న, విజేతలుగా నిలిచిన క్రీడాకారులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు షీల్డ్‌లు, మెమొంటోలతో అభినందించారు. ఈ నెల 21, 22, 23 తేదీలలో కలికిరిలోని జేఎన్‌టీయూఏ కాలేజ్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల నందు 12వ జేఎన్‌టీయూఏ అంతర్ కళాశాల క్రీడాపోటీలు జరిగాయి. ఈ క్రీడా పోటీల్లో 33 కళాశాలల నుంచి 800 మంది పాల్గొనగా ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొని పలు బహుమతులు సాధించారు. అందులో టేబుల్ టెన్నిస్‌లో పురుషుల సింగిల్స్‌లో చందు, మహిళా విభాగంలో చందన, డబుల్స్‌లో చందు, వంశీధర్‌రెడ్డి గెలుపొందారు. అదేవిధంగా హ్యాండ్ బాల్‌లో మనోప్రియ, యాన్, గాయత్రి, సైక్, నజీమ, ఇందువర్షిణి, వెంకటసౌమ్య, వర్షిత, ఆర్యశ్రీ, లోకేశ్వరి, మౌనిక, లక్ష్మీప్రియ విజేతగా నిలిచి బహుమతులు సాధించారు. క్రీడాకారులను డైరెక్టర్ విజయ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, ఆయా విభాగాధిపతులు, షీల్డ్‌లు, మెమొంటోలతో అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

చిట్టేడులో మెగా రక్తదాన శిబిరం

కోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడులో గల జీవీఆర్ రొయ్యల పరిశ్రమలో సోమవారం ఆ పరిశ్రమల అధినేత స్వర్గీయ గ్రంధి వెంకటేశ్వరరావు జయంతిని కార్మికులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర రావు చిత్రపటానికి రొయ్యల పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ గ్రంధి చల్లారావు, జీఎం కృష్ణన్‌లు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా 200 మంది కార్మికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి అందించారు. అనంతరం పరిశ్రమలోని 1200 మంది కార్మికులకు గ్రంధి చల్లారావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



రక్తదానం చేస్తున్న కార్మికులు

12 మంది బడిబాట



ఓజిలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వలస కుటుంబాలకు చెందిన 12 మంది పిల్లలను ఎంఈవో శైలజ ఆధ్వర్యంలో బడిలో చేరారు. మండలంలో సోమవారం ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టారు. ఈ క్రమంలో రాజుపాళెంలో మైసూరు నుంచి వచ్చిన వలస కుటుం బాలలో 12 మంది పిల్లలు బడికి వెళ్లకుండా ఉండడాన్ని స్థానిక హెచ్‌ఎం ఆది నారాయణ, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు గుర్తించారు. ఎంఈవో శైలజ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలం దరినీ పాఠశాలలో చేర్పించారు. పిల్లలకు పలకలు అందించారు. కాగా ఈ పిల్లలకు ఆధార్ కార్డులు లేవని వాటిని ఇప్పించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో కోరారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఏర్పాటు



అసోసియేషన్ కార్యవర్గాన్ని సన్మానిస్తున్న మందుల షాపుల యజమానులు

సూళ్లూరుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ది సూళ్లూరుపేట కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీ వంగా ఎన్నుకొన్నారు. సోమవారం స్థానిక అలవల కంటి వైద్యశాల రోటరీ భవనంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టుల సమావేశం నిర్వహిం చారు. అధ్యక్షుడిగా అంకిరెడ్డి కృష్ణారెడ్డి, కార్యదర్శిగా కుమారస్వామి, కోశాధికారిగా మదన్మో హన్‌ను ఎన్నుకొన్నారు. అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మందుల షాపుల యజమానులు సన్మానించారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిం చారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యా లతో అభిషేకం నిర్వహించి కర్పూర హార తులిచ్చారు. అనంతరం స్వామివారిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి ధూప, దీప, నై వేద్యాలు, మహామంగళ హారతులు సమ ర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

6న సీతారామ కల్యాణం

శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నెహ్రూవీధిలో కొలువై ఉన్న పట్టాభిరామ మందిరంలో ఏప్రిల్ 6వ తేది సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు ఆదివారం ఉదయం 11గంటలకు మందిర ప్రాంగణంలో కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు.

క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి

నారాయణవనం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి దర్శిత్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినం సందర్భంగా నారాయణవనంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర దగ్గు, బలహీనంగా ఉన్నట్లయితే వెంటనే వైద్యులను కలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో హరినాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సదస్సులు

నారాయణవనం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సదస్సును సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ తెలిపారు. ఈనెల 25, 26 తేదీల్లో మండలంలోని అరణ్యం కండ్రిగ సబ్‌స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు, ఏరికంబట్టు సబ్‌స్టేషన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు, 26వ తేది సముదాయం సబ్‌స్టేషన్‌లో నిర్వహించనున్న సదస్సులో సమస్యలను అర్జీలు రూపంలో ఇవ్వాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి


కళ్లాల్లోనే నిల్వ ఉన్న ధాన్యం

కేవీబీపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి కోతలు మొదలయ్యాయి. యంత్రాలతో నూర్పిడి చేసుకుని ఎక్కడి ధాన్యం అక్కడే కళ్లాల్లోనే నిల్వ చేసుకుంటున్నారు. కేవలం కొనుగోలు కేంద్రాలు లేక... దళారులకు విక్రయించ లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో అంజూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. కేవీబీపురంనుంచి అంజూరు దూరంగా ఉంది. అంత దూరం తీసుకెళ్లి రైతులు నిల్వ చేసుకోలేరు. మండలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. 900 హెక్టార్లలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. నూర్పిడి చేసిన ధాన్యంపై పట్టలు కప్పుకుని రైతులు ఎదురుచూస్తున్నారు. అధికారులు స్పందించి మండలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. సత్యవేడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో 10 మంది బాధితులకు రూ.12.56 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా సత్యవేడుకు చెందిన చంద్రకు రూ.1,95,999, శివకు రూ.53,333, ఈశ్వరయ్యకు రూ.51,512, నాగయ్యకు రూ.1,97819, నారా యణవనం మండలానికి చెందిన టి.కె.దొరైరాజుకు రూ.30 వేలు, మలర్‌కొడికి రూ.1,55,138, వరదయ్యపాళెం మండలానికి చెందిన మారెయ్యకు రూ.1,00,000, అరుణకు రూ.2 లక్షలు, బీఎన్‌కండ్రిగ మండలానికి చెందిన మురళీ నాయుడికి రూ.1,89,523, కేవీబీపురం మండలానికి చెందిన ఎన్.గౌతమికి రూ.83,314 చెక్కులను పంపిణీ చేశారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సుందరరామిరెడ్డి, మాజీ ఎంపీపీ మస్తాన్, నాయకులు పరమశివం, యుగంధర్‌రెడ్డి, హేమభూషణం, మురళి, శశిమోహన్, బాబు, నారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

దారి ఆక్రమణపై చర్యలు తీసుకోండి

పిచ్చాటూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులరాజు కండ్రిగలో దారి ఆక్రమించిన వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి జనార్దన్ మాట్లాడుతూ గోవర్ధనగిరి సర్వే నెం.67, 68లో ఓబులరాజు కండ్రిగ దళితులు 48 మందికి ప్రభుత్వం పట్టాలిచ్చి దారి సౌకర్యం కల్పించిందన్నారు. అయితే దారిని గోవర్ధనగిరికి చెందిన వైసీపీ నాయకుడు బాలాజీ నాయుడు ఆక్రమించి ఫెన్సింగ్ వేశారన్నారు. దీనిపై జనవరిలో జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీ సమర్పించామన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి దారి ఆక్రమణకు గురైనట్టు గుర్తించి బాలాజీ నాయుడిని హెచ్చరించినప్పటికీ ఆయన తీరు మారలేదన్నారు. అనంతరం చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ సుబ్రహ్మణ్యంకు, ఎస్ఐ వెంకటేష్‌కు వినతి పత్రాలు అందజేశారు. కేవీబీపురం పిచ్చాటూరు, నారాయణవనం మండలాల ప్రాంతీయ కార్యదర్శి నాగరాజు, పిచ్చాటూరు మండల నాయకులు రామచంద్రారెడ్డి, మాతయ్య, బాబు, సుబ్బమ్మ, కన్నమ్మ, మహిళలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దళితుల దీక్ష



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు దళితులు ఇంటి స్థలాలు కోసం సీపీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు సోమవారానికి పదమూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలోని సర్వే నెంబర్లు 252, 253లో ఇంటి స్థలాలు ఆక్రమించిన ఇంటి పట్టాలు ఇప్పటి వరకు ఇవ్వడం లేదన్నారు. దీక్షలు చేస్తున్న అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణం ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే సుధీర్ సహకారం మరువలేనిది


ఈద్గా వద్ద ముస్లింలు

శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా ఈద్గాలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎమ్మెల్యే సుధీర్ సహకారం మరువలేనిదని ముస్లింలు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ... ఎమ్మెల్యే సూచనలతో పట్టణంలో ఈదులగుంట ఈద్గా మైదానంలో ముస్లింలకు పవిత్రమైన నమాజ్ గోడ కట్టించడం, ముళ్లపొదలతో నిండిన స్థలాన్ని శుభ్రం చేయించారన్నారు. అదే విధంగా షాదీ మహల్‌ను అందంగా తీర్చిదిద్దడంతో పాటు రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారన్నారు. ముస్లింల అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నారన్నారు. షాకీరాలీ, బీఎస్ అక్రంసాహెబ్, మున్నా సాహెబ్, హఫీజ్, షఫీ, మీర్జా, ఖాదర్‌బాషా, ఖలీల్, సాజిద్, ఆరిఫ్, అంజాద్‌బాషా, తాజుద్దీన్, రషీద్, నయూమ్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే సమస్యలను పరిష్కరించండి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోనే సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా వీర్వోలు, కార్యదర్శులు పని చేయాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అర్జీలు సమర్పించారు. అర్జీలపై వీఆర్వోలు, సంబంధిత శాఖల అధికారులు గ్రామాల్లో విచారణ జరిపి నివేదికలు ఇవ్వాలన్నారు. అర్జీలపై పలువురు వీఆర్వోలు నత్తనడకన విచారణ చేపడుతున్నారని చెప్పారు. ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఆర్ఐ నల్లయ్య, మండల సర్వేయరు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవండి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి (ఆంధ్రజ్యోతి): క్రమ శిక్షణతో కూడిన విద్యను విద్యార్థులు చదవాలని సీఐ తిమ్మయ్య తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం, ఎస్సీ బాలికలు, ఎస్సీ బాలుర వసతి గృహాలను ఎస్ఐ విశ్వనాథనాయుడుతో కలసి సీఐ సోమవారం పరిశీలించి విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల దశ చాలా కీలకమైనదని , ఉన్నత లక్ష్యాలను చేదించేందుకు ఇక్కడ నుంచే ప్రారంభం కావాలన్నారు. ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చునన్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ మీట్‌లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



నారాయణవనం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ మీట్‌లో సిద్ధార్థ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు పీడీ సూరిబాబు తెలిపారు. మార్చి 21వ తేది నుంచి 23 వరకు కలికిరి జేఎన్‌టీయూలో నిర్వహించిన పోటీల్లో హ్యాండ్‌బాల్, వాలీ బాల్ విభాగంలో తమ కళాశాల జట్లు విజేతలుగా నిలిచాయన్నారు.

ఎన్టీఆర్‌నగర్‌లో తనిఖీలు

శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ ప్రాంతంలో సోమవారం రాత్రి 1టౌన్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎన్టీఆర్‌నగర్‌లోని పలు చోట్ల చీకటి పడితే కొందరు తిష్ఠవేసి బహిరంగంగా మద్యం సేవిస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. 1టౌన్ సీఐ గోపి సిబ్బందితో ఎన్టీఆర్‌నగర్ ప్రాంతంలో పలు స్థావరాలను తనిఖీ చేశారు. బహిరంగంగా మద్యం తాగే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేడు డయల్ యువర్ ఆర్డీసీ డీఎం

శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు మేనేజరు మునిచంద్రయ్య తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు జరుగుతుందని తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను మేనేజరు దృష్టికి తీసుకురావాలన్నారు. నెం.9959225673కు ఫోన్ చేయవచ్చన్నారు.

ఇరుకు వంతెనతో తప్పని తిప్పలు


వంతెన వద్ద ఇనుప రైలింగ్ కింద ఇరుక్కున్న లారీ(ఫైల్ ఫొటో)

రేణిగుంట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఇరుకు వంతెనతో వాహనదారులకు నిత్యం తిప్పలు తప్పడం లేదు. రేణిగుంట పట్టణంలోని పాత చెక్‌పోస్ట్ వద్ద ఉన్న రైల్వే వంతెనను ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పటి వాహన రాకపోకలకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మించి రెండు పక్కల రాకపోకలకు ఏర్పాటు చేశారు. అయితే రైల్వే వంతెన కింద సరుకుతో వచ్చిన లారీలు, కంటైనర్ లారీలు ఇరుక్కుపోతున్నాయి. దీంతో రైల్వే అధికారులు వంతెనకు రెండు పక్కల భారీ వాహనాలను నియంత్రించేందుకు ఇనుప రైలింగ్ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఆ రైలింగుకు వాహనాలు తగులుకుని గంటల కొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ప్రతిసారీ పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం లేకపోవడంతో సమస్య సర్వసాధారణమైంది. ఈ విషయంపై డీఎస్పీ శ్రీనివాసరావుని వివరణ కోరగా... గతంలో రైల్వే అధికారులు దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. రైల్వే డీఆర్ఎం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరు చెంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కల్లూరు చెంగయ్య

శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరు చెంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తిలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో జనాభా లెక్కలు, కులగణన జరగలేదన్నారు. కుల జనాభా నిర్ధారణ కాకముందే ఎస్సీ వర్గీకరణ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అత్యధిక సంఖ్యలో ఉన్న మాలలకు అన్యాయం జరిగేలా వర్గీకరణ చేయడం బాధాకరమన్నారు. పార్లమెంటులో మాత్రమే రిజర్వేషన్ వర్గీకరణ చేసే అధికారం ఉంటుందన్నారు. అయితే తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణకు ముందుకు ఎందుకు ఉత్సాహం ప్రదర్శిస్తున్నారని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా కుల చిచ్చు రేపడానికి కుతంత్రాలు జరుగుతున్నాయన్నారు. మాలలకు జరిగే అన్యాయంపై త్వరలో సీఎం చంద్రబాబును కలిసి తమ గోడును విన్నవించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చింతా రాజేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోగిల ధర్మయ్య, రాష్ట్ర మాల మహాసేన నాయకులు తలారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చెయ్యిచెయ్యి కలిపి క్షయవ్యాధిని నిర్మూలిద్దాం


శ్రీకాళహస్తిలో జరిగి క్షయ నిర్మూలన అవగాహన ర్యాలీ

శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): చెయ్యిచెయ్యి కలిపి క్షయ వ్యాధిని నిర్మూలిద్దామని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఇన్‌ఛార్జి ఆర్ఎంవో డాక్టర్ మధు పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా ఆస్పత్రి వైద్యసిబ్బంది, జ్ఞానప్రసూనాంబిక నర్సింగ్ విద్యార్థినులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధు మాట్లాడుతూ... రెండు వారాలకు మించి దగ్గు, గళ్ల పడటం, తరచూ జ్వరం రావడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించి వంటి లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఒక వేళ నిర్ధారణ అయితే డాట్స్ పద్ధతి ద్వారా మందులు ఇచ్చి నెలకూ రూ.వెయ్యి రోగి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారన్నారు. టీబీ సూపర్‌వైజర్ శివరాజు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): టీబీని కలిసికట్టుగా అరికడదామని మెడికల్ ఆఫీసర్ లావణ్య అన్నారు. వరల్డ్ టీబీ డే సంద్భంగా చిన్నపాండూరు ఆరోగ్యకేంద్రం పరిధిలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వైద్య సిబ్బంది, టీబీ ల్యాబ్ సూపర్‌వైజరు శివ పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల వైద్యాధికారి సురేష్, సత్యవేడు సర్పంచ్ మంజుల ఆధ్వర్యంలో క్షయ వ్యాధి అవగాహన ర్యాలీ జరిగింది. డాక్టరు హరినాథ్, సోహైల్, ప్రేమ, బాల శివ, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ అనూష, దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, సచివాలయం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లగంగమ్మ జాతర సందడి


విశ్వబ్రాహ్మణ వీధిలోని నల్లగంగమ్మ అమ్మవారు - విశ్వబ్రాహ్మణ వీధిలో, కంఠా వీధిలో విద్యుద్దీప అలంకరణలు

శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెట్టు, విశ్వబ్రాహ్మణ వీధుల్లో జాతర సందడి నెలకొంది. పట్టణంలోని తెట్టు కూడలి వద్ద కొలువై ఉన్న నల్లగంగమ్మ జాతరకు సోమవారం వేకువ జామున చాటింపు జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువు దీర్చనున్నారు. బుధవారం వేకువజామున అమ్మవారి ఊరేగింపు ఆలయం నుంచి బహదూరుపేటలో సాగి తిరిగి కంఠా వీధిలో అమ్మవారు కొలువుదీర్చుతారు. బుధవారం రాత్రి అమ్మవారి నిమజ్జనంతో జాతరకు ముగింపు జరుగుతుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ అలంకరణలతో ఈ ప్రాంతం సుందరంగా ముస్తాబైంది. అలాగే ఇక్కడికి సమీపంలో ఉన్న విశ్వబ్రాహ్మణవీధిలోని నల్లగంగమ్మ అమ్మవారి జాతర కూడా బుధవారం జరగనుంది. యేటా రెండు నల్లగంగమ్మల జాతర మహోత్సవాలు తూర్పు కనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ జాతర రోజే జరగడం ఆనవాయితీ. ఇందులో భాగంగా విశ్వబ్రాహ్మణవీధిలో అమ్మవారి ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో, అమ్మవారి మూలమూర్తిని వెండి కవచాలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం ఉదయం నుంచి విశేష అభిషేకాలు, హారతులు ప్రారంభం కానున్నాయి. మంగళవారం సాయంత్రం కుంభం సమర్పణ జరగనుంది. అనంతరం బుధవారం జాతర వేడుక కొనసాగుతుంది.

రేపు ముక్కంటి ఆలయ హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 26వ తేదీ బుధవారం హుండీ లెక్కింపు జరగనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆలయంలోని ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద హుండీలను దక్షిణామూర్తి సన్నిధి వద్ద ఉదయం 7గంటలకు లెక్కిస్తామన్నారు.

జన సైనికుడికి సన్మానం



శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం విజయం సాధిస్తే వైజాగ్ కనకమహాలక్ష్మి ఆలయం నుంచి సైకిల్ యాత్ర చేసి తిరుమల శ్రీవారిని దర్శించుకుంటానని పాయకరావుపేట జన సైనికుడు జి.తాతబాబు మొక్కుకున్నారు. పవన్ కల్యాణ్ విజయం సాధించడంతో ఆయన మొక్కులు తీర్చుకునేందుకు సైకిల్‌పై బయలు దేరాడు. మార్గమధ్యంలో శ్రీకాళహస్తికి సోమవారం చేరుకున్నాడు. జనసేన నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. బస చేసేందుకు గదిని ఏర్పాటు చేశారు. శివకుమార్, తోట గణేష్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారం


బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

వరదయ్యపాళెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదు సదస్సులో భాగంగా సంతవేలూరు సబ్‌స్టేషనలో గ్రామసభను నిర్వహించారు. ప్రజలు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇందులో భాగంగా అంబూరు, కలత్తూరు, మరదవాడ, కువ్వాకొల్లి, సంతవేలూరు, సాదనవారిపాళెం, ఇసుకపాళెంలకు త్రీఫేస్ 24 అవర్స్ బ్రేకర్‌ను సబ్‌స్టేషన్ పరిధిలో ఛార్జి చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఈ దేవాశీర్వాదం, నాగలాపురం ఈఈ రమేష్, వరదయ్యపాళెం ఏఈఈ విజయ వెంకటేష్, కన్‌స్ట్రక్షన్ డీఈ బాలాజీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం పరిశీలన

వరదయ్యపాళెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరదవాడ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం తిరుపతి జిల్లా మెడికల్ టాస్క్‌ఫోర్స్ డీపీఎంవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. మొదట ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు, బాలింతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించాలని ఆదేశించారు. ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా గణాంక అధికారి నాగేంద్ర, జిల్లా కార్యక్రమ అధికారి ప్రకాష్, హెల్త్ సూపర్‌వైజర్ నరేష్, వైద్యాధికారులు ఉదయ్‌కుమార్, ద్వైత, సామాజిక ఆరోగ్య అధికారి మధుసూదన్, ఆరోగ్య పర్యవేక్షకురాలు జయలక్ష్మి, ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు నల్లగంగమ్మకు అభిషేకం

శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బహదూరుపేట తెట్టులో కొలువై ఉన్న నల్లగంగమ్మ జాతర ఈనెల 26న బుధవారం జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం అమ్మవారికి అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం 9గంటలకు అభిషేకం జరుగుతుందన్నారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, తేనె మొదలగు పూజా సామాగ్రిని అందించాలన్నారు. మధ్యాహ్నం 1గంటకు పంచహారతులు నిర్వహిస్తామన్నారు.

జాతర ప్రశాంతంగా జరగాలి

నల్లగంగమ్మ జాతర ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీగా వ్యవహరించాలని ఆలయ కమిటీ సభ్యులకు డీఎస్పీ నరసింహమూర్తి సూచించారు. ఈ మేరకు డీఎస్పీ కార్యాలయంలో జాతర ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ నెల 25వ తేది రాత్రి నుంచి 26వ తేది రాత్రి వరకు జరిగే నల్లగంగమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటు ఇవ్వకూడదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఇప్పటికే 8 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. జాతర బందోబస్తుకు ఏర్పాట్లు చేయనున్నట్లు డీఎస్పీ చెప్పారు.

30న కవి సమ్మేళనం

శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 30న ఉగాదిని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం జరుగుతుందని ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్వామి వారి ప్రధాన ఆలయం ఎదుట ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

బహిరంగ ప్రకటన

... M/s. Shriram Finance Ltd., Sullurpet ... 1.Pamanji China Babu @ Pamanji Venkateswarlu S/o Nagendra Naidu 2.Pamanji Madhavi @ Matam Madhavi W/o Dinesh D/o Chinababu, Kummaragunta, Satyavedu, Tirupati District ... Sri Matam Dinesh S/o Dhanamjaya ...

SCHEDULE

Chittoor district present Tirupati District-Satyavedu sub registration, mandal & village accounts S.No.52/4d.Gandhi road, back side of ward no.11, D.no.11/29, 11/29/1 vacant house site an extent of 75.56 sq yards within the following boundaries:- East: Vacant site of Radha & Hari, South: A schedule site, West: 2nd item sandu dari, North: C schedule Item No.2: lane leading to item no.1 within the following boundaries:- East: 1st item, A & C schedule site South: A schedule site, West: House of Govindaswamy, North: Gandhi road. within the above boundaries an extent of 33 sq yards, 1/3 joint right for ingress and egress.

S.Sreeramulu Yadav, M.A., B.L., Advocate, Off: 3-2-155, old Shar Busstand Road, Sullurpet. Cell: 94404 56976

గ్రామ పంచాయతీ కార్యాలయం, తూకివాకం

రె.క.నెం. 18/2025 **టెండరు ప్రకటన** తేది : 22-03-2025

తిరుపతి జిల్లా, రేణిగుంట మండలం, తూకివాకం గ్రామ పంచాయతీకి 2025-2026వ సంవత్సరమునకు అనగా 01-04-2025 నుండి 31-03-2026 వరకు గల కాలమునకు దిగువ అనెగ్జరులో తెలిపిన పరికములు సప్లై చేయుటకు అధీకృత డీలర్ల నుండి సీల్డు టెండర్లు కోరబడుతున్నవి. సదరు టెండర్ల యందు పాల్గొను వారు దిగువ తెలిపిన విధముగా టెండరు డిపాజిట్లు చెల్లించి టెండర్లు తేది 28-03-2025 ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటలలోగా సమర్పించవలయును రాబడిన టెండర్లను అదే రోజు మధ్యాహ్నం 3.15 గంటలకు టెండరుదారుల సమక్షంలో తెరువబడును.

మిగతా వివరములు కార్యాలయ పనివేళలు/ పనిదినములందు వచ్చి తెలుసుకొనవచ్చును.

ప.నెం.	సప్లై చేయవలసిన వాటి వివరములు	టెండరు ధరావత్తు
1.	రక్షిత నీటి సరఫరా పరికరములు సప్లై చేయుట(ISI)	10000/-
2.	ప్రజారోగ్య పరికరములు సప్లై చేయుట (ISI)	10000/-
3.	సబ్ మెర్సిబుల్ మోటార్లు రీవైండింగ్ మరియు పంపు రిపేర్లు చేయుట	5000/-
4.	విద్యుత్ విడి పరికరములు సప్లై చేయుట (ISI)	10000/-

షరతులు:-

1. టెండరు షెడ్యూలు రూ.లు 500.00లు చెల్లించి పొందవలెను.
2. టెండరు ధరావత్తు పంచాయతీ కార్యదర్శి, తూకివాకం గ్రామ పంచాయతీ పేరిట డిమాండ్ డ్రాఫ్టు రూపములో చెల్లించవలెను.
3. ఎ.పి.జి.యస్.టి/ జి.యస్.టి. రిజిస్ట్రేషన్ కలిగిన వారు మాత్రమే టెండర్ల యందు పాల్గొనవలెను.
4. ఎటువంటి కారణములు తెలుపకనే టెండర్లను రద్దు చేయుటకు/ వేరొక తేదీకి వాయిదా వేయుటకు కార్యదర్శి పూర్తి అధికారము కలిగియున్నారు.
5. గ్రామ పంచాయతీ ఆర్థిక పరిస్థితులను బట్టి బిల్లులు చెల్లించబడును.
6. టెండరు రేట్లు మార్కెట్ రేట్లకు లోబడి ఉండవలెను.

పి. బాలాజీ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ తూకివాకం, రేణిగుంట మండలం.

యస్. మునిశేఖర్‌రెడ్డి, సర్పంచ్, గ్రామ పంచాయతీ తూకివాకం, రేణిగుంట మండలం.